ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily
తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 05-05- 2026 | సంపుటి: 17, సంచిక: 33, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## బెంగాల్ గడ్డపై

# కమల వికాసం

## అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక విజయం

### 294 స్థానాల్లో 206 స్థానాలు కైవసం - టీఎంసీకి 80 చోట్ల విజయం ఖరారు



కోల్‌కతా, మే 4: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కోటలు కూలాయి. మమత నాయకత్వంలోని 15 ఏళ్ల టీఎంసీ పాలనను అనూహ్యంగా బీజేపీ నిలువరించింది. కేంద్రమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత సువేందు అధికారి నాయకత్వంలో బీజేపీ వ్యూహాత్మక పోరాటం సాగించింది. కర్ణుడు చావుకు కారణాలు వెయ్యి అన్నట్లుగా.. అనేక కారణాలతో టీఎంసీ ఓటమిపాలైంది. ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ బలంగా ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లింది.

పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. రాష్ట్రంలో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. సొంతంగా 206 స్థానాలను కైవసం చేసుకున్నది. ప్రభుత్వ ఏర్పాటుకు మేజిక్ ఫిగర్ 148 కాగా, బీజేపీ అంతకు ఎంతో మించి స్థానాలను దక్కించుకున్నది. అధికార టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితమైంది. ఒక చోట ఆధిక్యంలో ఉంది. ఫలితాల్లో ఒకప్పుడు బంగాల్‌లో చక్రం తిప్పిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఈ ఎన్నికల్లో నామరూపాల్లేకుండా పోయాయి. కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాలను మాత్రమే దక్కించుకోగలిగింది. ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ కూడా రెండు స్థానాల్లోనే విజయం సాధించింది. రాష్ట్రాన్ని సుదీర్ఘ కాలంపాటు పాలించిన సీపీఎం ఒకే ఒక్క సీటుతో సరిపెట్టుకుంది. ఆల్ ఇండియా సెక్యులర్ ఫ్రంట్ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది.

తరువాయి 2వ పేజీలో...



## కింగ్ మేకర్ కాదు..

# కింగ్ విజయ్!

### 234 అసెంబ్లీ స్థానాల్లో టీవీకే 107 స్థానాలు కైవసం

- మ్యాజిక్ ఫిగర్ 118 కాగా, పగ్గాలు చేపట్టేందుకు మరికొన్ని సీట్లు అవసరం
- మద్దతు కూడగట్టే పనిలో టీవీకే అధినేత విజయ్
- డీలా పడిన డీఎంకే.. 60 స్థానాలు కైవసం
- జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ చెరో ఒక స్థానానికి పరిమితం

చెన్నై, మే 4: తమిళనాడు చరిత్రలో సరికొత్త రికార్డు నమోదైంది. 1967లో ద్రవిడ ఉద్యమ వెల్లువ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు ద్రవిడ పార్టీలైన డీఎంకే, ఏడీఎంకే మధ్యే అధికారం మారుతూ వచ్చింది. కానీ, ఈ రెండు పార్టీలను పక్కనపెట్టి ఇన్నాళ్లికి అక్కడి ప్రజలు టీవీకే అనే కొత్త పార్టీకి జైకొట్టారు. టీవీకే అధినేత విజయ్‌కి 107 స్థానాల్లో కట్టబెట్టి ఘన విజయం అందించారు. దీంతో ఆయనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 118. ఫలితాల్లో టీవీకే ఒంటరిగానే 107 స్థానాలను కైవసం చేసుకుని అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అంటే.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ అల్లంత దూరంలోనే ఉంది. ప్రస్తుతం విజయ్ మ్యాజిక్ ఫిగర్ అధిగమించేందుకు అవసరమైన మద్దతును కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే తమిళనాడులో సరికొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. విజయ్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, ఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల అధికారాన్ని బద్దలు కొట్టినట్లవుతుంది.

తరువాయి 2వ పేజీలో...



## రాహుల్ ట్వీట్

- టీవీకే విజయంపై అభినందనలు తెలిపిన రాహుల్ గాంధీ
- ఫోన్‌లో మాట్లాడి అభినందించినట్టు వెల్లడింపు
- యువశక్తి ఎదుగుదలకు ఈ ఫలితాలు నిదర్శనం
- కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందన్న హామీ
- తమిళనాడు, పుదుచ్చేరి ప్రజల కోసం పని చేస్తామన్న వ్యాఖ్య

హైదరాబాద్, మే 4 (ప్రజాకలం): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ అధినేత విజయ్‌కు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

# హిమంతకు ప్రజాభిషేకం

## అసోంలో హిమంత హ్యాట్రిక్

- బీజేపీకి వరుసగా మూడోసారి ఘన విజయం
- 89 వేలకుపైగా మెజారిటీతో సీఎం హిమంత విజయం
- జలుక్‌బరి నుంచి ప్రత్యర్థులకు చిత్తు
- అక్రమ చొరబాట్లపై కఠిన వైఖరికి ప్రజల మద్దతు
- అభివృద్ధి, భద్రతే విజయానికి ప్రధాన కారణాలు



హైదరాబాద్, మే 4 (ప్రజాకలం): అసోం అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ మరోసారి ఘన విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. రాష్ట్ర ప్రజలు వరుసగా మూడోసారి బీజేపీకి అధికారం కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వంపై తమ విశ్వాసాన్ని మరోసారి వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గమైన జలుక్‌బరి నుంచి పోటీ చేసిన హిమంత బిశ్వ శర్మ ఏకంగా 89,434 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆయనకు మొత్తం 1,27,151 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థి బిదిష నియోగ్‌కు కేవలం 37,717 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. ఈ ఫలితం హిమంత వ్యక్తిగత ప్రజాదరణ ఎంతగా పెరిగిందో స్పష్టం చేస్తోంది. ప్రత్యేకంగా బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా జరిగే చొరబాట్లపై హిమంత ప్రభుత్వం అనుసరించిన కఠిన వైఖరి ప్రజలను ఆకట్టుకుంది.

తరువాయి 2వ పేజీలో...

## కాంగ్రెస్‌కు

# కేరళ కిరీటం



- యూడీఎఫ్ విజయం స్ఫూర్తిదాయకమన్న సీఎం రేవంత్ రెడ్డి
- ప్రచార సమయంలో ప్రజల అభిమానం గుర్తుచేసుకున్న సీఎం
- ప్రగతిశీల విలువలకు కేరళ తీర్పు ప్రతీక అన్న వ్యాఖ్య
- తెలంగాణ, కేరళలు ప్రజాస్వామ్య స్ఫూర్తి రాష్ట్రాలంటూ ప్రశంస
- కాంగ్రెస్ విజయంతో అభివృద్ధికి నాంది పలికిందన్న అభిప్రాయం
- జాతీయ నేతలకు ప్రత్యేక అభినందనలు తెలిపిన రేవంత్
- ప్రజల తీర్పు స్పష్టమన్న టీపీసీసీ, మంత్రుల స్పందన

హైదరాబాద్, మే 4 (ప్రజాకలం): కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన ఘన విజయం దేశ రాజకీయాల్లో కొత్త సం దేశాన్ని ఇచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన యూడీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, కేరళ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన, కేరళలో తన ప్రచార సమయంలో ప్రజలు చూపిన అపారమైన

తరువాయి 2వ పేజీలో...

# మోదీ కృతజ్ఞతలు

## ఎన్డీఏకు మద్దతిచ్చిన తమిళనాడు ప్రజలకు ప్రధాని ధన్యవాదాలు



- నటుడు విజయ్, టీవీకేకు ప్రత్యేక అభినందనలు
- తొలి ఎన్నికల్లోనే టీవీకే సత్తా చాటిందని ప్రశంస
- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం హామీ
- మౌలిక సదుపాయాలు, సంక్షేమంపై దృష్టి
- తమిళనాడుతో బలమైన సంబంధాలపై కేంద్ర సంకల్పం

న్యూఢిల్లీ, మే 04; 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ)కు మద్దతు తెలిపిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోమవారం సోషల్ మీడియా ద్వారా విడుదల

2లో

## విజయ్‌కు కేసీఆర్ అభినందనలు

- టీవీకే తొలి ఎన్నికల్లోనే సంచలన విజయం
- సాంప్రదాయ రాజకీయాలకు సవాల్ విసిరిన విజయ్
- తమిళనాడు అభివృద్ధికి నూతన దిశ చూపుతారని ఆశాభావం

2లో

## స్టాలిన్ స్పందన

### ఓటమిని అంగీకరించిన డీఎంకే అధినేత

- ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని స్పష్టం
- నిర్మాణాత్మక ప్రతిపక్షంగా పనిచేస్తామని హామీ
- గత పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టామన్న వ్యాఖ్య
- విజయ్ నేతృత్వంలోని టీవీకేకు అభినందనలు

## కలం కౌంటర్




# బీజేపీ గ్రాండ్ ప్లాన్

- బహుముఖ ప్రణాళికతో కమలదళం చారిత్రాత్మక విజయం
- "నరేంద్ర కప్" టోర్నీలతో యువతలో బలమైన పట్టు
- 70 వేలకుపైగా బూత్ కమిటీలతో క్షేత్రస్థాయి బలోపేతం
- చార్జిషీట్లు, నినాదాలతో ప్రభుత్వ వ్యతిరేకత పెంపు
- పరివర్తన్ యాత్రలతో ప్రజల్లో మార్పు భావన
- మోదీ, షా పర్యటనలతో రాజకీయ సమీకరణాల్లో మార్పు
- మహిళలు, యువత కోసం భరోసా కార్డులతో ఓటర్ల ఆకర్షణ

2లో

# బెంగాల్ గడ్డపై కమల వికాసం

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యమంత్రి సువేందు?

బీజేపీ నుంచి ముఖ్యమంత్రి రేసులో పార్టీ సీనియర్ నేత సువేందు అధికారి ఉన్నారు. ఆయన ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన చోటుచేసుకున్న సమయంలో ఆయన చేసిన పోరాటం అక్కడి ప్రజలను ఆకట్టుకుంది. బంగాల్ రాజకీయాలపై పూర్తి పట్టు ఉన్న సువేందుకే ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని పార్టీ భావిస్తున్నట్లు తెలిసింది.

**గత అసెంబ్లీ ఎన్నికల్లో**

రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలు 2021లో జరిగాయి. రాష్ట్రంలో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భారీ విజయాన్ని సొంతం చేసు కుంది. ఆ పార్టీ ఏకంగా 213 సీట్లను గెలుచుకుని హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీ 77 స్థానాలకు పరిమితమైంది. నాడు వామపక్షాలు, కాంగ్రెస్ కూటమి ఒక్క సీటైనా గెలుచుకోలేకపోవడం గమనార్హం.ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయదుందుభి మోగించింది. పశ్చిమ బెంగాల్‌లో.. చరిత్రలో మొదటిసారిగా ప్రభంజనం సృష్టించింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని మట్టికరిపించింది. బీజేపీకి ఇది అనూహ్య విజయమే. అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్ పీఠాన్ని తిరిగి దక్కించుకొని తీరుతామనుకున్న మమత కలలు కల్లలయ్యాయి. మహిళలు, ముస్లిం మైనార్టీల ఓట్లలో చీలిక వచ్చింది. ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది.మమత ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ ఈ ఎన్నికల్లో తమదైన పోల్ మేనేజ్‌మెంట్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగింది. సోమవారం సాయంత్రం వరకు కూడా టీఎంసీ ఓటమి పాలవుతున్నదని వాస్తవాన్ని మమతా బెనర్జీ జీర్ణించుకోలేకపోయారు. ఫలితాల ప్రకటనలో కూడా అవకతవకలు జరుగుతున్నాయని దీదీ ఆరోపించారు. ఇక అసోంలో ఊహించినట్లుగానే సీఎం హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఘన విజయం సాధించింది. 126 స్థానాలున్న అసోం అసెంబ్లీలో బీజేపీ సొంతంగా 82 నియోజకవర్గాల్లో విజయాన్ని కైవసం చేసుకుంది. పుదుచ్చేరిలోనూ ఎన్డీఏ ఘన విజయం సాధించింది. సీఎం రంగసామి నాయకత్వంలో ఎన్డీఏ అక్కడ ఊహించినట్లుగానే గెలుపునందుకుంది. తమిళనాడులో 'యాక్సిస్ మై ఇండియా' ఎగ్జిట్ పోల్స్ నిజమయ్యాయి. సినీ నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే అధికారంలోకి రానున్నట్లు ఆ సంస్థ చెప్పిన జోస్యం నిజం కాబోతున్నది. అనూహ్యంగా తమిళ నాడులో విజయ్ తన విశ్వరూపం ప్రదర్శించారు. దశాబ్దాలుగా అధికారాన్ని పంచుకున్న డీఎంకే, అన్నాడీఎంకేలను వెనక్కినెట్టి విజేతగా నిలిచారు. సంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు ఈసారి టీవీకేకు పట్టం కట్టారు. కేరళంలో అవినీతిమయమైన పిన రయి విజయన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొట్టారు. అక్కడ యూడీఎఫ్ ఘన విజయం సాధించింది. ఐదు దశాబ్దాల్లో తొలిసారి దేశంలో లెఫ్ట్ శకం ముగిసింది.

# మోదీ కృతజ్ఞతలు

మొదటి పేజీ తరువాయి...

చేసిన సందేశంలో ఆయన, ప్రజలు ఇచ్చిన మద్దతు తమపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని ప్రధాని వెల్లడించారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, పేదల సంక్షేమ పథకాల అమలులో కేంద్రం మరింత దృష్టి సారిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రశంసించారు. దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్న తమిళనాడు రాజకీయాల్లో, టీవీకే వంటి కొత్త రాజకీయ శక్తి ఎదగడం గమనించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. తొలి ప్రయత్నంలోనే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం ఆ పార్టీకి గొప్ప విజయమని అభిప్రాయపడ్డారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మోదీ పునరుద్ఘాటించారు. రహదారులు, రైల్వేలు, పోర్టులు, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణకు మరింత నిధులు కేటాయించడమే కాకుండా, పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం వంటి రంగాల్లో కూడా కేంద్రం సహకారం మరింత పెరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులో రాజకీయంగా కొత్త సమీకరణాలు ఏర్పడుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్న వేళ, కేంద్రం రాష్ట్రంతో అభివృద్ధి మరియు రాజకీయ సంబంధాలను మరింత బలోపేతం చేయాలన్న సంకల్పాన్ని ప్రధాని సందేశం స్పష్టం చేస్తోంది.

# బీజేపీ గ్రాండ్ ప్లాన్

హైదరాబాద్, మే 4 (ప్రజాకలం) :

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంవత్సరాలుగా అజేయంగా భావించిన అధికా రాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఒక కీలక రాజకీయ పరిణామంగా నిలిచింది. ఈ విజయం యాదృచ్ఛికం కాదని, దీని వెనుక సుదీర్ఘ ప్రణాళిక, బహుముఖ వ్యూహాలు, క్షేత్రస్థాయి కృషి సమన్వయం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంప్రదాయ ఎన్నికల ప్రచార పద్ధతులకు మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలోని వివిధ వర్గాలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం ఈ విజయానికి ప్రధాన కారణమైంది. ముఖ్యంగా యువతను ఆకర్షించేందుకు చేపట్టిన "నరేంద్ర కప్" ఫుట్‌బాల్ టోర్నమెంట్లు పార్టీకి గణనీయమైన మద్దతును తెచ్చాయి. వేలాది జట్లు, లక్షలాది యువత పాల్గొన్న ఈ క్రీడా కార్యక్రమాల ద్వారా బీజేపీ యువ ఓటర్లతో నేరుగా అనుసంధానం ఏర్పరచుకుంది. క్రీడలను రాజకీయ అవగాహనకు వేదికగా మార్చడం పార్టీ వ్యూహాత్మక నైపుణ్యాన్ని చూపించింది.

సాంస్కృతికంగా కూడా బీజేపీ చురుకుగా వ్యవహరించింది. "వందేమాతరం" 150వ వార్షికోత్సవాన్ని పెద్ద స్థాయిలో నిర్వహిస్తూ పాదయాత్రలు, సామూహిక గీతాలాపనలు, జాతీయ జెండాల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ భావోద్వేగాలను ప్రజల్లో బలపరిచింది. ఈ చర్యలు ప్రజల్లో భావోద్వేగ అనుసంధానాన్ని పెంచడంలో కీలకంగా మారాయి. ఇక సంస్థాగతంగా బీజేపీ చేసిన కృషి అత్యంత ప్రాముఖ్యత కలిగినది. రాష్ట్రవ్యాప్తంగా 70 వేలకుపైగా బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, లక్షలాది కార్యకర్తలను రంగంలోకి దింపింది. ఈ బూత్ స్థాయి వ్యవస్థ ఎన్నికల సమయంలో ఓటర్లను చైతన్యపరచడం, పోలింగ్ రోజున వారిని బూత్‌లకు తీసుకురావడం వంటి అంశాల్లో కీలక పాత్ర పోషించింది. అలాగే గత ఎన్నికల డేటాను విశ్లేషించి కీలక నియోజకవర్గాలను గుర్తించి, అక్కడ ప్రత్యేకంగా దృష్టి సారించడం వ్యూహాత్మక నిర్ణయంగా మారింది. "పరివర్తన్ యాత్ర" వంటి కార్యక్రమాల ద్వారా మార్పు అవసరాన్ని ప్రజల్లో బలంగా ప్రతిబింబించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించిన ఈ యాత్రలు బీజేపీకి ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానాన్ని పెంచాయి. లక్షలాది మంది పాల్గొనడం ద్వారా పార్టీ ప్రభావం గ్రామీణ స్థాయికి కూడా విస్తరించింది. ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడంలోనూ బీజేపీ స్పష్టమైన వ్యూహాన్ని అమలు చేసింది. రాష్ట్ర స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు చార్జిషీట్లు విడుదల చేసి, స్థానిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చింది. "భయ్ అవుట్, భరోసా ఇన్", "చుప్ చాప్ కమల్ ఛాప్" వంటి నినాదాలు ప్రజల్లో మార్పు, భద్రత, నమ్మకం అనే భావనలను బలపరిచాయి. అదేవిధంగా యువత, మహిళలను ఆకట్టుకునేందుకు "యువ భరోసా కార్డ్", "మాతృశక్తి భరోసా కార్డ్" వంటి పథకాల ద్వారా భారీ స్థాయిలో నమోదు ప్రక్రియ చేపట్టారు. మతపరమైన, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం ద్వారా సమాజంలోని విభిన్న వర్గాలతో అనుసంధానం పెంచారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విస్తృతంగా పర్యటించడం ప్రచారానికి మరింత ఊపునిచ్చింది. భారీ ర్యాలీలు, సభలు ప్రజల్లో ఉత్సాహాన్ని పెంచడంతో పాటు పార్టీకి మానసిక ఆధిక్యాన్ని కూడా కల్పించాయి. ముఖ్యంగా కోల్‌కతాలో జరిగిన భారీ సభకు లక్షలాది మంది హాజరుకావడం బీజేపీ బలాన్ని స్పష్టంగా చూపించింది. మొత్తంగా క్రీడలు, సంస్కృతి, సంస్థాగత బలం, లక్ష్మిత ప్రచారం, శక్తివంతమైన నాయకత్వం, ఈ అన్ని అంశాలను సమన్వయం చేస్తూ రూపొందించిన సమగ్ర వ్యూహం వల్లే బీజేపీ బెంగాల్‌లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని రాజకీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కింగ్ మేకర్ కాదు.. కింగ్ విజయ్!

మొదటి పేజీ తరువాయి...

**డీలా పడిన దమాల్**

అధికార డీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో రెండో స్థానానికి పరిమితమైంది. ఆ పార్టీ కేవలం 60 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. మరో ప్రధాన పార్టీ అన్నాడీఎంకే 47 స్థానాలను గెలుచుకుంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్ ఐదు స్థానాలకు.. భాజపా కేవలం ఒక స్థానానికి పరిమితమయ్యాయి. పట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) 4 చోట్ల జయకేతనం ఎగురవేసింది. ముస్లిం లీగ్, సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీలు తలా రెండు స్థానాలను దక్కించుకున్నాయి.

**గత అసెంబ్లీ ఎన్నికల్లో**

తమిళనాడులో గత అసెంబ్లీ ఎన్నికలు 2021లో జరిగాయి. రాష్ట్రంలో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలు ఉండగా డీఎంకే కూటమి ఘనవిజయం సాధించింది. డీఎంకే పార్టీ సొంతంగా 133 సీట్లను గెలుచుకుని అధికారాన్ని చేపట్టింది. ప్రధాన ప్రత్యర్థి అన్నాడీఎంకే పార్టీ 66 స్థానాలకే పరిమితమైంది.

**కొలత్తూరులో స్టాలిన్ పరాజయం**

**టీవీకే అభ్యర్థి బాబు చేతిలో ఓటమి**

చెన్నై, మే 4: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తన సొంత నియోజకవర్గమైన కొలత్తూరులో ఆయన ఓటమి పాలయ్యారు. 2011 నుంచి వరుసగా వడుసార్లు ఇక్కడ గెలిచిన స్టాలిన్ ఈసారి ఓడిపోవడం చర్చనీయాంశమైంది. తమిళనాడు రాజకీయ చరిత్రలో సీఎం పదవిలో ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన నాలుగో ముఖ్యమంత్రిగా స్టాలిన్ నిలిచారు. టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో స్టాలిన్ పరాజయం పాలయ్యారు. ఒకప్పుడు స్టాలిన్‌కు అత్యంత సన్నిహితుడైన బాబు.. ఇటీవల టీవీకేలో చేరి, ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. గతంలో బాబు ఉత్తర చెన్నై డీఎంకే జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2006లో పురసవాక్కం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు.



# విజయ్‌కు కేసీఆర్ అభినందనలు

- టీవీకే తొలి ఎన్నికల్లోనే సంచలన విజయం
- సాంప్రదాయ రాజకీయాలకు సవాల్ విసిరిన విజయ్
- తమిళనాడు అభివృద్ధికి నూతన దిశ చూపుతారని ఆశాభావం

హైదరాబాద్, మే 4 (ప్రజాకలం) :

ప్రస్తుత రాజకీయాల్లో 'డిస్రప్షన్' అనే పదానికి నేటి పరిణామాలే స్పష్టమైన ఉదాహరణ అని బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ తన తొలి ఎన్నికల పోరులోనే సాధించిన అద్భుత విజయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, రాజకీయాల్లో సాధారణంగా కనిపించే పాత పద్ధతులను, స్థిరపడిన ధోరణులను విజయ్ భంగపరిచారని అన్నారు. కొత్త ఆలోచనలు, ప్రజలతో నేరుగా మమేకమయ్యే విధానం, యువతను ఆకర్షించే వ్యూహాలతో విజయ్ ప్రజాదరణ పొందగలిగారని ఆయన విశ్లేషించారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అందుకు ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టమైన సంకేతమని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో కొత్త శక్తులు ముందుకు రావడం ఆరోగ్యకర పరిణామమని, ఇది భవిష్యత్తులో రాజకీయాలకు కొత్త దిశను అందిస్తుందని ఆయన అన్నారు. తమిళనాడు రాజకీయాల్లో విజయ్ ప్రవేశం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికారని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే విధంగా ఆయన పాలన కొనసాగాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. విజయ్ నాయకత్వంలో తమిళనాడు మరింత అభివృద్ధి చెందుతూ దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలవాలని కేసీఆర్ ఆకాంక్షిస్తూ, ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్‌కు కేరళ కిరీటం

మొదటి పేజీ తరువాయి...

ఆదరణను ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. ఆ ప్రేమ, విశ్వాసం ఈ విజయానికి పునాది అయ్యిందని అన్నారు. కేరళ ప్రజలు ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలంగా నమ్ముతున్నారని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలు అభివృద్ధి, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. గత దశాబ్ద కాలంలో ఎదురైన సవాళ్లను అధిగమించి, కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారా ప్రజలు అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికారని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయానికి ప్రధాన కారకులుగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కె.సి. వేణు గోపాల్, దీపాదాస్ మున్షీలను ఆయన అభినంది ంచారు. వారి నాయకత్వం, కృషి వల్లే యూడీఎఫ్ కూటమి ఈ విజయాన్ని సాధించిందని కొనియాడారు. ఇక టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా ఈ ఫలితాలపై స్పందిస్తూ, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కేరళ తీర్పు ప్రతిబింబించిందన్నారు. తెలంగాణ మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, యూడీఎఫ్‌కు కేరళ ప్రజలు ఇచ్చిన మద్దతు ఆనందదాయకమని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. మొత్తంగా, కేరళలో కాంగ్రెస్ విజయాన్ని ప్రజాస్వామ్య పునరుద్ధరణగా విశ్లేషిస్తున్న రాజకీయ వర్గాలు, ఇది భవిష్యత్ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నాయి.

# హిమంతకు ప్రజాభిషేకం

మొదటి పేజీ తరువాయి...

ఆదరణను ప్రత్యేకంగా ఆదివాసీ భూములను రక్షించేందుకు చేపట్టిన చర్యలు, చొరబాటుదారులపై నిర్బంధ విధానాలు ఆయనకు విస్తృత మద్దతు తెచ్చాయి. అలాగే "చికెన్‌నెక్ కారిడార్" అంశంపై వచ్చిన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిన విధానం కూడా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. ఇక వరద నియంత్రణ చర్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, చట్టవ్యవస్థ బలోపేతం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఎన్నికల్లో బీజేపీ విజయానికి కీలకంగా మారాయి. ఎన్ఆర్సీ అమలు ద్వారా అక్రమ చొరబాట్లకు శాశ్వత అడ్డుకట్ట వేస్తామన్న హామీ కూడా ఓటర్లను ప్రభావితం చేసింది. మొత్తంగా అభివృద్ధి, భద్రత, కఠిన పరిపాలన అనే మూడు ప్రధాన అంశాలపై ప్రజలు విశ్వాసం ఉంచడంతో అసోంలో బీజేపీ మరోసారి అధికారం సాధించింది. ఈ విజయంతో హిమంత బిశ్వ శర్మ నాయకత్వం రాష్ట్ర రాజకీయాల్లో మరింత బలపడింది.

# స్టాలిన్ స్పందన

## ఓటమిని అంగీకరించిన డీఎంకే అధినేత

**ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని స్పష్టం**

**నిర్మాణాత్మక ప్రతిపక్షంగా పనిచేస్తామని హామీ**

**గత పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టామన్న వ్యాఖ్య**

**విజయ్ నేతృత్వంలోని టీవీకేకు అభినందనలు**

హైదరాబాద్, మే 4 (ప్రజాకలం) :

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిపై డీఎంకే పార్టీ అధినేత ఎం.కే. స్టాలిన్ స్పందించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని స్పష్టం చేసిన ఆయన, విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని పేర్కొంటూ, డీఎంకే పార్టీ ఇకపై ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా కొనసాగుతుందని వెల్లడించారు. గత ఐదేళ్ల తమ పాలనలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అనేక కీలక కార్యక్రమాలు అమలు చేశామని స్టాలిన్ పేర్కొన్నారు. సుపరిపాలన అందించడానికి కృషి చేశామని, అదే విశ్వాసంతో ప్రజల ముందుకు వెళ్లి ఓట్లు అభ్యర్థించామని చెప్పారు. తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చినా, ప్రజా తీర్పు తమకు అనుకూలంగా రాలేదని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో విజయాలు, ఓటములు చూసిన అనుభవం ఉందని స్టాలిన్



పేర్కొన్నారు. ఈ ఓటమి తమ రాజకీయ ప్రయాణాన్ని ఆపదని, మరింత దృఢంగా ముందుకు సాగేందుకు ప్రేరణగా మారుతుందని చెప్పారు. డీఎంకే పార్టీ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, వారి సమస్యలపై గళం వినిపిస్తుందని వెల్లడించారు. తమిళనాడు ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఘన విజయం సాధించగా, డీఎంకే రెండో స్థానానికి పరిమితమైంది. ఈ నేపథ్యంలో స్టాలిన్ స్పందన రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# దేశంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయం : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 4: ప్రధాని నరేంద్ర మోదీని ఐదు అసెంబ్లీల ఎన్నికల్లో ప్రజలు తమ ఆశీర్వాదం అందజేశారని, పశ్చిమ బెంగాల్‌లో భారీ మెజా రిటీ దక్కిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశంలో తుడిచిపె ట్టుకుపోవడం ఖాయమని ఈ ఎన్నికల్లో రుజువైందని అన్నారు. దేశ ప్రజలంతా డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని కోరుకుంటున్నారని, దక్షిణ భారతదేశంలో కూడా బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు పుష్కలమైన అవకాశాలున్నాయని ధీమా వ్యక్తంచేశారు.

తెలంగాణలో కూడా ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం సానుకూలంగా ఉండనుందన్నారు. నరేంద్రమోదీ నేతృత్వంలో అందరం కలిసి కట్టుగాపని చేసి బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని కిషన్‌రెడ్డి బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ తొలిసారిగా ఈనెల 10న తెలంగాణకు రానున్నారని, ఈ సందర్భంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకుంటు న్నామన్నారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం పెరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదన్నారు. ఐదు అసెంబ్లీల ఎన్నికల్లో బీజేపీకి బ్రహ్మరథం పట్టిన ప్రజలకు, విజయం సాధించిన ఎమ్మెల్యేలకు కిషన్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# రాహుల్ ట్వీట్

మొదటి పేజీ తరువాయి...

ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. విజయ్‌తో ఫోన్‌లో మాట్లాడి, పార్టీ సాధించిన అద్భుత విజయానికి అభినందనలు తెలిపినట్లు రాహుల్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు దేశంలో యువగళం మరింత బలపడుతున్నదనడానికి స్పష్టమైన ఉదాహరణగా నిలిచాయని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలు, మార్పు పట్ల ఉన్న ఆశలు ఈ ఫలితాల్లో ప్రతిఫలించాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని, వారి కోసం ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నాయకత్వంలోని టీవీకే పార్టీ 100కు పైగా స్థానాల్లో గెలిచి అగ్రస్థానంలో నిలిచింది. డీఎంకే 70కి పైగా స్థానాలు, అన్నాడీఎంకే 50కి పైగా స్థానాలతో సరిపెట్టుకున్నాయి. మరోవైపు పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో బీజేపీ మరియు మిత్రపక్షాలు విజయపథంలో నడిచాయి. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారాన్ని చేజిక్కించుకుంది. మొత్తంగా దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు రాజకీయ పరిణామాల్లో కొత్త మార్పులకు నాంది పలికినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఘనంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

## మట్టి ఆరోగ్యంపై అవగాహన, రైతులకు సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ



రుద్రంగి, మే 04, (ప్రజాకలం ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ లు ముఖ్య అతిథులుగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు.. అధికారులు రైతులకు మట్టి ఆరోగ్య నిర్వహణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మట్టి పరీక్షలు చేయించుకొని, అందిన నివేదికల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా పంట దిగుబడి మరియు నాణ్యత పెరుగుతుందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల మట్టి నాణ్యత తగ్గుతుందని, సమతుల్య ఎరువుల వినియోగం మరియు సేంద్రీయ పద్ధతులు అనుసరించాలని సూచించారు. అలాగే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సాయిల్ హెల్త్ కార్డుల ప్రాముఖ్యతను వివరించి కార్యక్రమంలో వాటిని పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా భూమిలోని పోషకాల స్థితి తెలుసుకొని శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతుల సమస్యలు, పంటల పరిస్థితి, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించగా, రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు వేదిక లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల సమావేశం లో రైతులకు పలు సూచనలు



ఎండపల్లి, మే 04 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామ రైతు వేదిక వద్ద రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కొత్తపేట రైతు లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ స్పందన మాట్లాడుతూ తక్కువ యూరియా వాడకం, ఎరువుల యాజమాన్యం, సాగు నీటి యాజమాన్యం, పంటల మార్పిడి, పచ్చిరొట్ట పంటల సాగు, నేల ఆరోగ్యం, మార్కెట్లో గిరాకీ ఉన్న సన్న వరి రకాలు వంటి వివిధ అంశాల పై రైతులకు అవగాహన కల్పించటం జరిగింది. అలాగే తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త అయిన సుమలత మాట్లాడతూ పంటలకు వచ్చే చీడపీడలు, తెగులు మరియు వాటి యాజమాన్యం గురించి తెలపడం జరిగింది. అలాగే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా రైతు వారం కార్యక్రమం లో ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షలు, పంట అవశేషాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలు వంటి వివిద అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి కళ్యాడపు మౌనిక, కొత్తపేట సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, పడ్కల్ సర్పంచ్ ప్రవీణ్, అంబారిపేట సర్పంచ్ నరేష్, ఏఎంసి డైరెక్టర్ శ్రీనివాస్, ఎన్ ఎం ఎన్ ఎఫ్ సిఆర్ పి లు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతు వారం కార్యక్రమం

## గుల్లకోట రైతు వేదికలో రైతు సముదాయ స్థాయి సమావేశం



ఎండపల్లి, మే 04 : ( ప్రజా కలం ప్రతినిధి )జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో సోమవారం రోజున రైతు వేదిక లో రైతు ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతు వారం కార్యక్రమాలు రైతు సమదాయ స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి సుత్రపు లావణ్య, గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, అరిగేల రవి, చర్లపల్లి గ్రామం నుండి పడిదం మొగిలి, తిరుపతి, కొండాపూర్ గ్రామం నుండి గ్రామ మాజీ సర్పంచ్ పి మల్లేశం, ఎండపల్లి గ్రామం నుండి కుంట మల్లారెడ్డి, బంగారయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రైతు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది..

మల్లాపూర్, మే, 04 ( ప్రజా కలం ప్రతినిధి)రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ వాకిట భూమా రెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ మండలం రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నేల ఆరోగ్య పరిరక్షణకు సమతుల్య ఎరువుల వినియోగం, వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగు, ఉద్యాన పంటల విస్తరణ, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపు మరియు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మే 12న దొంగతుర్తిలో విరాట్

# హిందూ సమ్మేళనం

ధర్మారం,ఏప్రిల్ 04:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి)

హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి,భారతీయ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో మే 12న విరాట్ హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీ వేంకటేశ్వరస్వామి హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను సోమవారం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో సమితి సభ్యులు,ప్రజా ప్రతినిధులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పుణ్యభూమి అయిన భారతదేశంలో హిందూ ధర్మమే ప్రాణమని,ఎందరో మహానుభావుల త్యాగఫలమైన మన సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. మే 12న సాయంత్రం 5:00 గంటలకు దొంగతుర్తిలోని హనుమాన్ దేవాలయం వద్ద జరగనున్న ఈ ఆధ్యాత్మిక ఉత్సవంలో స్వామీజీల అనుగ్రహ భాషణం,ప్రముఖ వక్తల ధర్మ ప్రబోధంతో పాటు భక్తులందరితో సామూహిక హనుమాన్



చాలీసా పారాయణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు,అల్పాహార వితరణ ఉంటుందని వివరించారు. ఈ సమ్మేళనానికి మండలంలోని అన్ని గ్రామాల హనుమాన్ దీక్షాపరులు,భజన బృందాలు, వివిధ ఆలయాల నిర్వాహకులు, యువజన సంఘాలు,హిందూ బంధువులు తమ కుటుంబ సమేతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని సమితి కోరింది. ఈ కార్యక్రమంలో నిర్వహణ సమితి సభ్యులు,స్థానిక ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రతినిధులు మరియు హిందూ సంఘాల నాయకులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# ఏఐ రోబోటిక్స్‌తోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



## -అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి,మే 04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

విద్యార్థులు వేసవి సెలవులను సృజనాత్మకంగా వినియోగించుకోవాలని,ఇలాంటి సమ్మర్ కోచింగ్ శిబిరాలు వారిలో నైపుణ్యాలను పెంపొందిస్తాయని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు.తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్,సూపర్ టీచర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ సమ్మర్ కంప్యూటర్,ఏఐ అండ్ రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.గాంధీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలో గల గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ క్యాంప్‌ను ఆమె ప్రారంభించి,విద్యార్థులతో ముచ్చటించారు. లెర్నింగ్ ప్రోగ్రాం తీరును అడిగి తెలుసుకున్న ఆమె, నిర్వాహకుల కృషిని అభినందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణ శ్రీమాట్లాడుతూ భవిష్యత్తులో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంప్యూటర్,ఏఐ, రోబోటిక్స్‌పై ప్రాయోగిక జ్ఞానం పొందాలని సూచించారు. ఈ క్యాంప్‌లో భాగంగా కంప్యూటర్ వినియోగం,నిత్య జీవితంలో ఏఐ ఉపయోగాలు,రోబోటిక్స్ నమూనాల తయారీ మరియు ప్రాజెక్ట్ ప్రదర్శనలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ మల్లేశం,డీఆర్పీ ఎన్.రవి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రాంబాబు,స్వరూప్ చంద్,రమేష్,పీఆర్పీ శ్రీలతతో పాటు టీ ఫైబర్ మేనేజర్ శ్రీరామ్ రాహూల్ జువ్వాడి బృందం పాల్గొన్నారు.

# దేశద్రోహ శక్తులకు ఓటర్ల గుణపాఠం

## బెంగాల్, అస్సాం,పుదుచ్చేరి గెలుపే నిదర్శనం - పెద్దపల్లిలో బీజేపీ సంబరాలు

పెద్దపల్లి,మే 04:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి)

దేశం పట్ల,సనాతన హిందూ ధర్మం పట్ల వ్యతిరేకతను పెంచుకున్న పార్టీలకు దేశ ప్రజలు ఎన్నికల ఫలితాల ద్వారా సరైన గుణపాఠం చెప్పారని భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్,అస్సాం,పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో,సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా నాయకులు బాణాసంచా పేల్చి,మిఠాయిలు పంపిణీ చేసి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహరరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో అమలవుతున్న సబ్ కా సాత్ -సబ్ కా వికాస్ నినాదం,అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషే ఈ తిరుగులేని విజయాలకు కారణమని కొనియాడారు. భవిష్యత్తు భారతం మొత్తం బీజేపీమయం కాబోతోందని,కాంగ్రెస్ ముక్త్ భారత్ కల త్వరలోనే సాకారం కానుందని వారు ధీమా వ్యక్తం చేశారు. అలాగే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీల అమలులో విఫలమైందని విమర్శిస్తూ,వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ అజేయ శక్తిగా ఎదిగి



రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ విజయోత్సవ వేడుకల్లో బీజేపీ సీనియర్ నాయకులు శిలావేరు ఓదెలు,భూషణవేణ శ్రీనివాస్ గౌడ్,మౌటమ్ నర్సింగం,పర్శ సమయ్య,వెల్లంపల్లి శ్రీనివాస్,గనబోయిన రాజేందర్,శివంగారి సతీష్, తుడి రవీందర్,ఫహీమ్,చాతారాజు రమేష్, మొర మనోహర్, ప్రమోద్,పెండ్యాల కుమార్,తిరుపతి, రాజేంద్ర ప్రసాద్, మహేష్,బండ కరుణాకర్, జెట్టి రాజు,సతీష్, విజయ్,సంతోష్,శివయ్య,రాజు,నూనెటి వెంకటేష్,వేల్పుల సత్యం,బొల్లం వేణు,గొట్టెముక్కుల శ్రీనివాస్,మిట్టపల్లి వెంకటేష్,మల్లరెడ్డి,ఇరుగురాల భానుచందర్,ఓల్పుల శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చెయ్యాలని ప్రజావాణిలో వినతి




గొల్లపల్లి మే 04 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్తలు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. వేసవికాలం మొదలై ఎండలు మండిపోతున్న వేళ, అగ్నిప్రమాదాలు జరిగితే ఆదుకునే నాథుడే లేడని స్థానిక సామాజిక కార్యకర్తలు గంగాధర మధుసూదన్, సాతల లక్ష్మణ్, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం గంగాధర మధుసూదన్ మాట్లాడుతూ మండల కేంద్రం చుట్టూ 24 గ్రామాలు ఉన్నప్పటికీ, అత్యవసర సేవల విషయంలో మండల తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందనీ జగిత్యాల నుండి ఫైర్ ఇంజన్ రావాలంటే 18 కిలోమీటర్ల దూరం నుండి రావాలని ఈలోపే జరగరాని నష్టం జరిగిపోతోందనీ అన్నారు. వేసవి దృష్ట్యా తక్షణమే ఫైర్ ఇంజన్ గొల్లపెల్లి మండలం లో అందుబాటులో ఉంచాలనీ అన్నారు.పీహెచ్ లో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండి, అత్యవసర మందులు పంపిణీ చేయాలిని గ్రామ పంచాయితీ పరిధిలోని వాటర్ ట్యాంకర్లను ఎప్పుడూ నీటితో నింపి సిద్ధంగా ఉంచాలని.మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రయాణికులు ఎండలో నిలబడలేక ఇబ్బంది పడుతున్నారు. వెంటనే బస్సు షెల్టర్ నిర్మించాలని.జగిత్యాల – ధర్మారం రూట్లో బస్సుల రద్దీ విపరీతంగా ఉంది. మహిళల సౌకర్యార్థం అదనపు బస్సు బస్సులను పెంచలని తక్షణమే సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వాసులు సిరికొండ తిరుపతి, సరసాని అనిల్ రెడ్డి, సంగెం కళ్యాణ్, కంటే కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని కి నెల జీతం అందించిన సర్పంచ్

మల్లాపూర్,మే 04 ( ప్రజా కలం ప్రతినిధి) కొత్త దాంరాజ్ పల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో చదివి పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ ఎగ్యారపు లింబాద్రి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల టాపర్ గా నిలిచిన పోలాస .ధరణి కి సర్పంచ్ తన నెల వేతనాన్ని అందించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను శాలువాలతో సన్మానించారు ఈసందర్భంగా సర్పంచ్ ఎగ్యారపు



లింబాద్రి మాట్లాడుతూ 100% ఉత్తీర్ణత సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేసన్తూ,రాబోయే రోజుల్లో విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.మున్ముందు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వంశీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బద్దం. నర్సారెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బద్దం.సుధాకర్ రెడ్డి,నాయకులు మామిడి రాజ శేఖర్ రెడ్డి, నిగ.రవి, ఎగ్యరపు రాకేష్,బద్దం. వెంకట్ రెడ్డి, సురకంటి సంతోష్,గంగరాజం,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బీజేపీ గెలుపుతో మల్లాపూర్‌లో సంబరాలు



మల్లాపూర్, మే 04 (ప్రజా కలం ప్రతినిధి): దేశవ్యాప్తంగా ప్రజలు భారతీయ జనతా పార్టీకి పట్టం కడుతున్నారని మండల బీజేపీ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో విజయం సాధించడాన్ని పురస్కరించుకుని మల్లాపూర్‌లో పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి.

మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో భరతమాత కూడలి వద్ద కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, అభివృద్ధి మరియు సంక్షేమ పాలన పట్ల ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ఆదరణకు ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. తెలంగాణలో కూడా రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షులు లవంగ శివ, గడ్డం నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముస్కెరి రాజ్ కుమార్, బూత్ అధ్యక్షులు గాండ్ల గంగరాజు, ఎర్ర రాజు, భూక్యా రాజశేఖర్, మొరపు గంగరాజం, కోలా రాజేందర్, కోప్పేలా లక్ష్మారెడ్డి, అడగట్ల ప్రసాద్, ముస్కెరి సంతోష్, సంతరాజం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# గుల్లకోట ఐకెపి వద్ద కారు బోల్తా... ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎండపల్లి, మే 04 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామ శివారు లో సోమవారం రోజున గుల్లకోట ఐకెపి, పల్లె ప్రకృతి వనం వద్ద కారు బోల్తా ముగ్గురికి తీవ్ర గాయాలు ఎల్లాపూర్ రాజారాపల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి రాజయ్య, తన తమ్ముని కొడుకు కు కొడుకు పుట్టిన సందర్భంగా పురుడు కొరకు కారు లో వస్తున్న క్రమం లో మామిడిపెల్లి రాజయ్య, తన సొంత అల్లుడు పూర్ణచందర్, తన చిన్నబాపు కొడుకు కోరుట్ల గ్రామానికి చెందిన



తమ్ముని కొడుకు హరీష్, వారితో కలిసి రాజయ్య కారులో వస్తున్న క్రమం లో పల్లె ప్రకృతి వనం దగ్గర మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి పల్లె ప్రకృతి వనం పిల్లర్ కు గుద్దుకొని కారు బోల్తా పడడం తో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు వెంటనే గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ కు విషయం తెలవడంతో గ్రామ సర్పంచు మల్లేష్ గౌడ్ తన కారు లో తీసుకొని కరీంనగర్ ప్రైవేట్ అపెక్స్ హాస్పిటల్ కు తరలించడం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా

# రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమము

## - మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్

ఇబ్రహీంపట్నం మే 4 (ప్రజా కలం ప్రతినిధి )

ఇబ్రహీంపట్నం మండలంలోని ఇబ్రహీంపట్నం, గోధుర్, వర్షకొండ, వేములకుర్తి రైతు వేదికలలో రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా రైతులకి నేల ఆరోగ్యం యాజమాన్యం, సాయిల్ హెల్త్ కార్డ్ ఉపయోగాలు,మట్టి నమూనా సేకరించే విధానం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపైన అవగహన జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, నానో యూరియా, నానో డి ఎ పి పైన అవగాహన, వంటి అంశాలపైన కోరుట్ల ఏడిఏ రమేష్ అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ మార్కెట్ లో డిమాండ్ కలిగిన బీపీటీ 5204, తెలంగాణ సోనా, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, కృమ్ 1638, జ్గళ్ 1798,సిద్ధి వంటి సన్న రకాలు సాగు చేయాలి అని పంట కి అవసరమైన 16 రకాల పోషకాలు పైన అవగహన, యూరియా అప్ లో యూరియా బుకింగ్ పైన అవగహన,వరి పంట అవశేషాల యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. అనంతరం సాయిల్ హెల్త్ కార్డు లు పలువురు రైతులకి సర్పంచ్ లు బండి రాజేష్, బద్దం గోపి, కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి,తరి రామానుజం, పోనాకంటి వెంకట్ లు అందచేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ లు నాంపల్లి రమేష్, రాపెల్లి మహేష్, ఓంకార్ లక్ష్మాన్ , బర్మా మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామెర శ్రీనివాస్,ఏఈఓ లు వినోద్, సాగర్, సాయికృప, హెచ్ ఇ ఓ శ్రీలత,ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు

ప్రజా కలం
మంగళవారం, మే 5, 2026

# ఉపశమనమా లేక దీర్ఘకాల అభివృద్ధా?

దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయంగా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి. ఇవి ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది. యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి. ఇక్కడ విద్య, ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం. ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, హామీలు ఇవ్వడం చాలా సులభం. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది, ప్రజల నుంచే. ఒక సమాజం చైతన్యవంతంగా మారితే, రాజకీయాలు కూడా మారతాయి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా, తమ బాధ్యతలను కూడా గుర్తించాలి. ఉచితాల కోసం కాకుండా, అభివృద్ధి కోసం ఓటు వేయాలి. అప్పుడు మాత్రమే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, మేధావులు కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఉచితాలవల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలి. దీర్ఘకాల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనం కంటే సత్యాన్ని చూపాలి. మొత్తంగా చూస్తే, ఉచితాల రాజకీయాలు పూర్తిగా శాపమని చెప్పలేం. కానీ అవి నియంత్రణ లేకుండా కొనసాగితే, సమాజానికి నష్టం కలిగించే అవకాశం ఉంది. అవసరమైన చోట ఉచితాలు ఉండాలి, కానీ అవి ఒక వ్యూహంగా మారకూడదు. ప్రజల సంక్షేమం అనే పేరుతో ఓట్లు కొనే ప్రయత్నం ఆగాలి. ఈ రోజు మనం ఒక కీలక దశలో ఉన్నాం. ఒక దిశలో కొనసాగితే, మనం ఆధారపడి జీవించే సమాజంగా మారిపోతాం. మరో దిశలో ముందు కు సాగితే, మనం స్వయం సమర్థతతో అభివృద్ధి చెందే సమాజంగా మారగలం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న మళ్లీ అదే.. మార్పు ఎవరు తెస్తారు? జవాబు కూడా అదే, మనమే. ప్రజలు మేలుకుంటే, రాజకీయాలు మారతాయి. నాయకులు కూడా మారాల్సి వస్తుంది. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని నిలబెట్టుకోవాల్సి వస్తుంది. ఆ రోజు తప్పకుండా వస్తుంది. కానీ అది స్వయంగా రాదు. మన ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, మన ఓటులో మార్పు వచ్చినప్పుడే, మన సమాజంలో మార్పు వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరం, చైతన్యం, బాధ్యత, దీర్ఘకాల దృష్టి. ఉచితాల మాయ నుండి బయటపడి, అభివృద్ధి మార్గంలో నడవాల్సిన సమయం ఇదే.

# జనరల్ ఆసుపత్రి సేవలు మెరుగుపరచాలి




**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి,మే 04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

గోదావరిఖని జనరల్ ఆసుపత్రి సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పిల్లల విభాగానికి సంబంధించిన ఓపీ,ఐపీ సేవలను బలోపేతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనంగా పీడియాట్రిక్ వైద్యులను నియమించుకోవాలని సూచించారు. ఈఎన్టీ వైద్యుడిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు త్వరితగతిన ప్రారంభించాల్సిందిగా పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్ కృపాబాయి,డాక్టర్ శిరిష,డాక్టర్.రాజు,తదితరులు పాల్గొన్నారు.

**అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి**
**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని,ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం బందారిగుంట గ్రామానికి చెందిన సుధాకర్ రవీందర్, శోభన్ తమకు గ్రామ శివారు సర్వేనెంబర్ 556 లోని ఎకరం 22 గుంటల భూమి ఉందని దీనిని కొందరు అక్రమంగా దొంగ పట్టా చేయించుకున్నారని దీనిని పరిశీలించి ఆ పట్టా రద్దు చేసి మా పేరును విరాసిత్ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డీ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన ఎం రాఘవరెడ్డి తనకు అన్నం పెట్టకుండా పోషణకు వేధిస్తున్న ఇద్దరు కుమారులు కోడలి పై చర్య తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారిగా రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన జి సుమలత తనకు జీవనోపాధి కింద ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

**విధులకు గైర్హాజరైన రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్**
**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చిరంజీవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. కె.చిరంజీవి విధులకు గైర్హాజరు కావడంతో పాటు,ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం,వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించకపోవడం గమనార్హమని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై కమాన్‌పూర్ తహసీల్దార్ నివేదిక అందడంతో,సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, శాఖాపరమైన విచారణ చేపట్టనున్న నేపథ్యంలో,ఎ.పి. సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం కె.చిరంజీవిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుండి అమల్లో ఉంటాయని, విచారణ పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత ఉద్యోగి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పంటల మార్పిడితోనే రైతులకు మేలు

## - ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి,మే 04:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని,అన్నదాత సంతోషంగా ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -రైతు వారం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పుడూ ఒకే రకమైన పంటలు వేయకుండా మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల మార్పిడి చేయాలని సూచించారు. ముఖ్యంగా లాభదాయకమైన ఆయిల్ ఫామ్,పప్పు దినుసులు మరియు ఇతర వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రైతుల కోసం తాను ప్రత్యేకంగా విజ్ఞన్న భరోసా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైస్ మిల్లర్లను,అధికారులను సమన్వయం చేసి,తరుగు లేకుండా వడ్లు కొనుగోలు చేస్తున్న ఏకైక నియోజకవర్గం పెద్దపల్లి అని ఆయన గర్వంగా ప్రకటించారు. కొనుగోలు కేంద్రాల్లో చివరి గింజ వరకు కొంటామని,రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని,ఏ సమస్య వచ్చినా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ గత పదేళ్ల కాలంలో కటింగ్స్ పేరుతో రైతులను దోచుకున్నారని, అప్పుడు కూడా తాను రైతుల పక్షాన పోరాడానని గుర్తు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వచ్చే రైతును వంచించడం సరికాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు,మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# నిరుపేద రైతుకు కన్నీళ్లు

### నేను బ్రతికే ఉన్నా.. నా భూమిని ఎలా మాయం చేస్తారు..
### తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు కుటుంబ సభ్యులు.
### పూర్తి రికార్డులు పరిశీలించి ఇస్తాం : తహసీల్దార్

షాద్నగర్ మే 04 (ప్రజా కలం):ప్రతినిధి

తాను బ్రతికే ఉన్నప్పటికీ, తన పేరిట ఉండాల్సిన భూమిని అక్రమంగా ఇతరుల పేరిట మార్చేశారని ఓ రైతు గొల్లుమన్నాడు. న్యాయం కోసం భార్యాబిడ్డలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన ఘటన ఫరూక్ నగర్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది.

**ఘటన వివరాల్లోకి వెళ్తే..** ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన మైస బలయ్య తండ్రి పోచయ్య ఒక సాధారణ నిరుపేద రైతు. ఎలికట్ట శివారులో ఆయనకు పూర్వీకుల నుండి వచ్చిన భూమి ఉంది. సర్వే నెంబర్ 483లో 29 గుంటలు, సర్వే నెంబర్ 484లో ఒక ఎకరా 14 గుంటలు.. మొత్తంగా సుమారు రెండు ఎకరాల పొలం బలయ్య పేరిట రికార్డుల్లో ఉండేది. అయితే 2005 వరకు తన పేరిట ఉన్న భూమిని దొంగ పత్రాలు సృష్టించి నా భూమిని కాజేశారని ఆరోపించారు. కొంత కాలం క్రితం భూమి వివరాలను పరిశీలించగా, తన పేరుకు బదులు ఇతరుల పేర్లు ఉండటం చూసి సదరు రైతు దిగ్భ్రాంతికి గురయ్యాడు. అనంతరం కోర్టులో కేసు వేశామని, ప్రస్తుతం తమ భూమిని కబ్జా చేసిన వ్యక్తులు ఇతర పనులు చేస్తున్నారని, వారిని అడ్డుకోకపోతే తమని చంపేస్తామని బెదిరిస్తున్నారని రైతు బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

**భూ కబ్జాపై రైతు ఆవేదన**

నేను కళ్లముందే కనిపిస్తున్నా.. కానీ రికార్డుల్లో మాత్రం నా భూమిని మాయం చేశారు. భూమిపై కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేరిట మార్పిడి ఎలా చేస్తారు? అని బలయ్య అధికారులను నిలదీశారు. కబ్జాదారులు తనను తన సొంత పొలంలోకి కూడా వెళ్లనివ్వడం లేదని, ప్రాణహాని తలపెడుతున్నారని ఆయన ఆరోపించారు.




తమకు ఉన్నది ఆ కొద్దిపాటి భూమి మాత్రమేనని, అది కూడా పోతే తమ కుటుంబం రోడ్డున పడుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులు తహసీల్దార్ కార్యాలయం గేటు ముందు బైఠాయించి ఆందోళన చేయడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగయ్య బాధితులతో మాట్లాడారు. వారికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. రికార్డుల మార్పిడి ఎలా జరిగిందనే అంశంపై విచారణ జరుపుతామని, 2005 కంటే ముందు తరువాత రికార్డులు పూర్తిగా పరిశీలిస్తామని తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల్లో భూమికి సంబంధించిన అన్ని పాత రికార్డులు తనిఖీ చేస్తామన్నారు. ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. తహసీల్దార్ హామీతో రైతు కుటుంబం ప్రస్తుతానికి శాంతించినప్పటికీ, తమకు భూమి దక్కకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమ భూమిని తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీ కట్ట మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

## - ప్రభుత్వ విప్ విజయ రమణారావుకు ఆహ్వానం



పెద్దపల్లి,మే04:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు సమీపాన గల మినీ ట్యాంక్ బండ్ వద్ద వేంచేసి ఉన్న శ్రీ కట్ట మైసమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవం ఈ నెల 7న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బొడ్డుపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావలసిందిగా ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావును కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను కలిసి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి విజయ రమణారావు చేతుల మీదుగా పట్టు వస్త్రాలు, పండ్లు,పువ్వులు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బొడ్డుపల్లి శ్రీనివాస్ తెలిపారు. మే 7న జరిగే ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్,ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్,భూతగడ్డ సంపత్,రజక సంఘం పట్టణ అధ్యక్షులు బొడ్డుపల్లి రామ్మూర్తి,ఆలయ కమిటీ సభ్యులు ముక్కెర రాజేశం తదితరులు పాల్గొన్నారు.

### నందిగామ మండల నూతన అధ్యక్షుడిగా

# కుమార్ స్వామి గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక

నందిగామ మే 04 (ప్రజా కలం):ప్రతినిధి నందిగామ మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి పదవికి పార్టీ లోని సీనియర్ నాయకులు దేపల్లె కుమారస్వామి గౌడ్ ని పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ శ్రేణులు కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి,మండలంలోని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, నాయకత్వంలో , స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో నందిగామ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. దేపల్లె కుమార్ స్వామి గౌడ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి , ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువవుతానని పేర్కొన్నారు.

# నందిగామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఉప్పు చెంద్రశేఖర్ రెడ్డి నూతన గృహప్రవేశం

### కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కొమ్ము క్రిష్ణ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు



నందిగామ మే 04 : నందిగామ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉప్పు చెంద్రశేఖర్ రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన సర్పంచుల సంఘం అధ్యక్షులు కొమ్ము క్రిష్ణ. ప్రజలలో ఎప్పుడూ క్రియాశీలకంగా ఉండే ఆయన చెంద్రశేఖర్ రెడ్డి ఆహ్వానాన్ని మన్నించి ఈ శుభకార్యానికి విచ్చేశారు, నూతన గృహంలో అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు నూతన ఇల్లు ఆ కుటుంబానికి సుఖసంతోషాలను ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన స్థానిక నాయకులతో ఆయన కాసేపు ముచ్చటించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు,ఈ శుభకార్యానికి విచ్చేసిన సర్పంచ్ క్రిష్ణకు చెంద్రశేఖర్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేపల్లె కుమార్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ చాకలి నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చించెట్టి కృష్ణ గౌడ్, మాజీ ఏం.పి.టి.సి చంద్రపాల్ రెడ్డి, వార్డ్ మెంబర్ అగ్గీ ప్రసాద్ గౌడ్, టైలర్ కృష్ణ బొమ్మగల్లా నరసింహ, మురళి, ప్రణయ్,జంగయ్య, నరేంద్ర ఆర్(ఎఐ) బంధుమిత్రులు పాల్గొన్నారు.

### అకాల వర్షాలతో దెబ్బతిన్న పాలేరు

# రైతులకు ప్రభుత్వ వెంటనే సహాయం

### - ఉపేందర్ రెడ్డి డిమాండ్

పాలేరు మే 04( ప్రజా కలం న్యూస్ ) పాలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఒకవైపు ధాన్యం కొనుగోలు ఆలస్యం అవుతుండగా, మరోవైపు ఆకస్మిక గాలి, దుమ్మురంతో కూడిన వర్షాలు రైతులను కుదిపేస్తున్నాయని ఆయన తెలిపారు. కేంద్రాలు, మార్కెట్ యార్డుల వద్ద పొలాల వద్ద ఆరబోసిన వడ్లు, మొక్కజొన్న పంటలు, ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఇప్పటికే సాగులో అనేక కష్టాలు ఎదుర్కొన్న



రైతులు, పంట అమ్మకాల దశలో కూడా ప్రకృతి పరిపాలన సమస్యల మధ్య నలుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రైతుల ఆవేదన అర్థం చేసుకుని, జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం, మంత్రులు తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

## – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ మే 04 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్డీఓ కార్యాలయం నిర్మల్, సబ్ కలెక్టర్ కార్యాలయం బైంసాలో డివిజన్ వారీగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గణనలో భాగంగా నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు.



అధికారులు తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**6న మెగా జాబ్ మేళా...** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6వ ఖ=ఖ కె ఆర్ కే కాలనీ, మైనారిటీ గురుకులము, ఆదిలాబాద్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొనియువతకు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. ఐటీ, హెల్త్ కేర్, ఇండస్ట్రియల్, ఫార్మా, రిటైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, సేవా రంగాలకు చెందిన సంస్థలు పాల్గొననున్నాయి. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ తదితర అర్హతలు కలిగిన అభ్యర్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను ఎంపిక చేసుకొని అవసరమైన ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఆసక్తి గల యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నమోదు కోసం వెబ్‌సైట్: https://satg.telangana.gov.in/prajapalana/ అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, అనుభవ పత్రాలు తదితర అవసరమైన ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు: డివైఎస్ఓ, నిర్మల్ శ్రీకాంత్ రెడ్డి 9346655441 ని సంప్రదించాలన్నారు.

**వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి:**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు తీరును ఆయన పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రైతులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని గన్ని సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిర్ణీత తేమశాతానికి రాగానే ధాన్యం తూకం వేసి, వెంటనే వరి ధాన్యాన్ని తరలించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, ప్రతి రైతు తమ ధాన్యాన్ని శుభ్రపరచి మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. ఇలా చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని వివరించారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎం సివిల్ సప్లయిస్ సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీ కాంతరావు, సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ విజయం దేశ ప్రజలందరి విజయం

### రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి జెండా ఎగరడం ఖాయం
### బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



షాద్నగర్ మే 04 (ప్రజా కలం):ప్రతినిధి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఈరోజు వచ్చిన ఫలితాలలో మూడు రాష్ట్రాల్లో పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలలో బిజెపి అఖండ విజయం సాధించడం దేశ ప్రజలందరి విజయం అని బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ గెలుపు కార్యకర్తలు ఎన్నో సంవత్సరాలనుండి ప్రాణ త్యాగం చేస్తే వచ్చిన గెలుపు అని అన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో తెలంగాణలో కూడ బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. ఈ విజయం తరువాత ఈ నెల 10 వ తేదీన మన ప్రధానమంత్రి నరేంద్రమోధీ గారి పేరేడ్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్ళి విజయవంతం చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప, వంశీకృష్ణ, శ్యామ్ సుందర్ రెడ్డి,అత్తాపురం మహేందర్ రెడ్డి,మిద్దె గణేష్,కుడుముల బాల్ రాజ్, కృష్ణ యాదవ్, ప్రశాంత్ గౌడ్,రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు..

# దౌల్తాబాద్ రైతు వేదికలో ఘనంగా రైతు వారోత్సవం

## - శాస్త్రీయ పద్ధతులపై అవగాహన



తానూర్, మే 04(ప్రజా కలం): తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా దౌల్తాబాద్ రైతు వేదికలో రైతు వారోత్సవం నిర్వహించారు, నేల పరిరక్షణ, ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాలు, పంట రుణాలు మరియు యాంత్రీకరణ వంటి కీలక అంశాలపై ఎఈవో సిరాజ్ రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాదవ్ అనిత – చంద్రకాంత్,రైతులు,గ్రామస్తులు పాల్గోన్నారు..

# చనిపోయిన హోం గార్డు కుటుంబానికి ముప్పై లక్షల ఆర్థిక సహాయం అందజేత




నిర్మల్ మే 04 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) నిర్మల్ జిల్లాలోని బాసర పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వెంకట రమణ అనే హోం గార్డు కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ సందర్భంగా యాక్సిడెంటల్ బెనిఫిట్ స్కీమ్ కింద మృతుడి కుటుంబానికి రూ. 30 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, తన చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సంక్షేమం పట్ల ప్రభుత్వం పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. మృతుడి కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంతమేరకు ఆదరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పది ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు ఎన్‌హెచ్‌ఆర్ ఘన సన్మానం

## - మండల టాపర్లకు నగదు బహుమతిగా అందజేత




మల్హార్, మే04, ప్రజాకలం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మేనం ప్రణవి, లాస్య, ఆశ్రితలను నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు జ్యోతిశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, యాంటీ కరప్షన్ బ్యూరో జాతీయ అధ్యక్షుడు వీరమనేని సంపత్ రావు సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీరమనేని సంపత్ రావు మాట్లాడుతూ.. గతంలో మలహర్, చిట్యాల, టేకుమట్ల మండలాల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేసిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కమిటీ తరపున మొదటి బహుమతిగా రూ. 2500, రెండో బహుమతిగా రూ. 1000 నగదును అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు తిర్రి అశోక్, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ జల్లరాపు ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడుదుల రాజు, జిల్లా జాయింట్ సెక్రెటరీ రాగం కుమార్, సుదర్శన్, లింగన్నపేట శ్రీనాథ్, జెడ్పీ హెడ్ మాస్టర్ తిరుపతి, ఉపాధ్యాయులు కుమారస్వామి, మహేష్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకి అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

## - బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు

పాలేరు మే 04( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం జిల్లాలోని వివిధ మండలాలలో అర్హత కలిగిన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని నేలకొండపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులు ప్రజలకు, అధికారులకు, రాజకీయ నాయకులకు మధ్య వారధిగా నిలిచి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తు ప్రజలకు కాంతిని అందిస్తున్న పాత్రికేయులను అక్రిడేషన్ కార్డు ఇవ్వకుండా ఇష్టానుసారంగా జిల్లాస్థాయి వారికి మాత్రమే ఇవ్వడం కరెక్ట్ కాదని హెచ్చరించారు. అయితే జిల్లాలో కొందరికి మాత్రమే



అక్రిడేషన్ కార్డులు పరిమితం చేసి, మండల స్థాయిలో ఉన్న గ్రామీణ ప్రాంత పాత్రికేయులకు ఇవ్వకుండా రెండవ విడతలో ఇస్తామని నమ్మించడం సరైంది కాదని విమర్శించారు. ఇది గ్రామీణ జర్నలిస్టులకు నష్టం కలిగించే చర్యగా పేర్కొన్నారు. జీతభత్యాలు సరిగా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించి, వారి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన అక్రిడేషన్ కార్డులను అర్హులైన అందరికీ ఇవ్వాలని బొడ్డు బాబురావు కోరారు. ఒకవేళ అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వకపోతే, అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు.

# ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
### పెండింగ్ భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
### కలెక్టరేట్లో అభివృద్ధి పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం, మే04( ప్రజా కలం న్యూస్ )

ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన ప్రాధాన్య అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లందు రోడ్ వద్ద ఉన్న నిర్మాణాన్ని రేనోవేషన్ చేసి ఫ్రూట్ మార్కెట్ స్థాపనకు సంబంధించిన ప్రతిపాదనలు సమయానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫ్రూట్ మార్కెట్ కాంపౌండ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించి నిధులు మంజూరు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిల్పారామం కోసం ఇప్పటికే 9 ఎకరాలు ఇవ్వడం జరిగిందని, అదనంగా 3 ఎకరాలు 21 గుంటలు అవసరమని, వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను సమయానికి పూర్తి చేయాలని, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో భాగంగా ప్రధాన సీవరేజ్ పైపులైన్ పనులను వేగవంతం చేయాలని, మొత్తం 8.5 కి.మీ పైపులైన్‌లో ఇప్పటికే 7.7 కి.మీ పూర్తి అయినందున మిగిలిన పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథతో ఎటువంటి మిక్సేజ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధంసలాపురం వద్ద ఎస్టీపీ పనులు త్వరలో ప్రారంభించాలని తెలిపారు. హరిత హోటల్ నిర్మాణానికి భూమి అప్పగించడం జరిగిందని, వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజీ–9లో కొంత మేరకు భూసేకరణ సమస్య ఉందని, స్థానికులతో చర్చించి త్వరగా పరిష్కరించాలని, తహసీల్దార్, సబ్ కలెక్టర్‌ను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాద సభ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పాలేరు మే 4 (ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి చేతులు మీదుగా ప్రజా ఆశీర్వాద సభ పోస్టర్ ని ఆవిష్కరించడం జరిగింది,సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత బస్సు,200 యూనిట్ల ఉచిత కరెంట్,సన్న బియ్యం,500కే గ్యాస్ రైతులకు బోనోస్ వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మనసును గెలుచుకుంది, ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయడానికి ప్రజల ఆశీర్వాద సభను ఈ నెల 31న ఆదివారం ,సమయం సా"5 గంటలకు , కూసుమంచి బస్టాండ్ సెంటర్ నందు నిర్వహించడం జరుగుతుంది,కావునా ప్రతి ఒక్కరు,ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై,కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకుడు కొమ్ము ప్రసాద్ పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్ము ప్రసాద్,ని అభినందించడం జరిగింది, కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమని ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రారంభించి ప్రజల వద్దకు పాలన తీసుకువస్తుందని తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త సుధీర్ కుటుంబాన్ని పరామర్శించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ.



పాలేరు మే 04 (ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలం పరిధిలోని సోమవారం గొరిల్లపాడు తండా బిఆర్ఎస్ కార్యకర్త బానోత్ సుధీర్ నాయక్ తండ్రి గారైన బానోత్ జామికిరామ్ ఇటీవల కాలంలో మరణించిన విషయం తెలుసుకొని ఈరోజు వారి స్వగ్రాహం నందు ఫోటో పూల దండేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని భరోసా కల్పించిన పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య, జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న, మాజీ సర్పంచ్ బానోత్ కిషన్ నాయక్ మాజీ ఎంపీటీసీ జర్పుల బాలాజీ నాయక్, సోషల్ మీడియా అధ్యక్షుడు వద్యా బాలకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు తేజావత్ శ్రీను నాయక్, బానోత్ జీవన్ నాయక్ ,చోటి నాయక్ స్థానిక నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి జిల్లా టాపర్ ప్రణవికి ఘన సన్మానం

మల్హార్, మే 4 ప్రజాకలం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మేనం ప్రణవిని శ్రీ సాయివాణి విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించింది. మండల కేంద్రంలోని శ్రీ సాయివాణి విద్యానికేతన్‌లో ప్రణవి 1 నుంచి 5వ తరగతి వరకు విద్యనభ్యసించి, అనంతరం తాడిచర్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తమ పూర్వ విద్యార్థిని ప్రణవిని పాఠశాల కరస్పాండెంట్ వీరమనేని సంపత్ రావు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలలో పునాది వేసుకున్న విద్యార్థిని జిల్లా స్థాయిలో టాప్‌గా నిలవడం గర్వకారణమని కొనియాడారు. సాయివాణి పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో చదివి విత్తనం వలె మొలకెత్తి, నేడు మహావృక్షాల్లా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రణవి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## నేడు మంగళగూడెంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 'ప్రజా దర్బార్'

పాలేరు మే 4( ప్రజా కలం న్యూస్)



పాలేరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, నేడు (మంగళవారం) మంగళగూడెంలో 'ప్రజా దర్బార్' నిర్వహించనున్నారు.
వేదిక : సీతారామ చంద్రస్వామి దేవాలయ కళ్యాణ మండపం, మంగళగూడెం.
సమయం : మధ్యాహ్నం 03:30 గంటలకు.
గ్రామాలు : మంగళగూడెం, పొలిశెట్టిగూడెం, కామంచికల్, పడమటితండా, దారేడు, తీర్థాల, పోలేపల్లి (పార్ట్), గోళ్ళపాడు, పల్లెగూడెం.
ఈ సదస్సులో భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్ల దరఖాస్తులను మంత్రి స్వయంగా స్వీకరిస్తారు. జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు వేదికపైనే ఉండి సమస్యలను పరిష్కరిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు.

## తాడిచెర్ల యువకుడికి 'గిన్నిస్' గుర్తింపు

### కరాటే కాటాలో పెంట రఘు అరుదైన ఘనత



మల్హర్, మే 04: ప్రజాకలం ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన యువకుడు పెంట రఘు అంతర్జాతీయ స్థాయిలో మెరిశాడు. గత నెల ఏప్రిల్ 26న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 'లార్జెస్ట్ కరాటే డిస్ప్లే – కరాటే కాటా' ఈవెంట్‌లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించాడు. 21 రాష్ట్రాల నుంచి వచ్చిన 2000 మందిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 1212 మందిలో రఘు ఒకరిగా నిలిచారు. కోచ్ రాజు రాథోడ్ నాయక్ శిక్షణలో రాటుదేలిన రఘు, ప్రస్తుతం హైదరాబాద్‌లో లా చదువుతున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మిత్రులు రఘును అభినందనలతో ముంచెత్తుతూ అభినందలు తెలుపుతున్నారు.

## యువ ఇంజనీర్ల శిక్షణ బాధ్యతను పరిశ్రమలు స్వీకరించాలి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్, మే 4 (ప్రజాకలం) : తెలంగాణాలో ఏటా చదువులు పూర్తి చేసుకుంటున్న 2 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణనిచ్చి, ఉద్యోగాలకు సంసిద్ధులను చేసే కర్తవ్యాన్ని పరిశ్రమలు స్వీకరించాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. యూనివర్సిటీ చదువులకు, ఇండస్ట్రీ అవసరాలకు అంతరం పెరిగినందున ప్రతి సంస్థ తమ బాధ్యతగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని శ్రీధర్ బాబు సూచించారు. నగరానికి చెందిన పిఎస్ ఆర్ టెక్ హబ్ సంస్థ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నాడు బేగంపేట లోని వివాంతా హోటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. టెక్నాలజి రంగంలో నిత్యం ఎదురయ్యే పెను సవాళ్లను అధిగమించి పదేళ్లలో రూ.120 కోట్ల సంస్థగా నిలదొక్కుకునేలా చేయడం పట్ల పిఎస్ టెక్ హబ్ అధినేత పి. శ్రీరంగారావును శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. కరోనా సమయంలో ఎన్నో సంస్థలు మూతపడటమో, నష్టాలకు గురికావడమో జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. టెక్నాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక ఆవిష్కరణలు, ఏఐ లాంటి సవాళ్లను ఎదుర్కొని 250 మంది ఉద్యోగులకు భరోసానివ్వడం సాధారణ విషయం కాదని శ్రీధర్ బాబు కొనియాడారు. వేగంగా విస్తరిస్తున్న ఏఐ ప్రభావాన్ని ఎదుర్కొనేలా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్ల నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు. 'ఏఐ హబ్' పేరుతో ప్రత్యేక శిక్షణ సంస్థను ఏర్పాటు చేసి వచ్చే రెండు నెలల్లో రీస్కిల్లింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు.
భారీ విస్తరణకు ప్రణాళికలు: పిఎస్ ఆర్ టెక్ హబ్ దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తోందని డైరెక్టర్ పి. నమ్యుత తెలిపారు. వచ్చే మూడేళ్లలో దేశం వెలుపల కార్యాలయాలను విస్తరించి ఉద్యోగుల సంఖ్యను 1,000 కి పెంచుతామని వివరించారు. మంత్రి సూచన మేరకు చదువులు పూర్తయిన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణనిచ్చి, ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, క్లయింట్లు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

### కార్మికులకు కూటమి ప్రభుత్వంలో

## పూర్తి భద్రత, భరోసా వచ్చింది

### - కార్మిక శాఖ మంత్రి సుభాష్

విజయవాడ :కూటమి ప్రభుత్వంలో కార్మికులకు పూర్తి భద్రత, భరోసా వచ్చిందని కార్మిక శాఖ మంత్రి మంత్రి సుభాష్ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అనేక కంపెనీలను రాష్ట్రాన్ని వదిలి వెళ్లేలా చేశారని దాంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోకి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో కార్మికులు పస్తులు ఉంటే, తమ మంచి ప్రభుత్వంలో ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల కార్మికులు కూడా పనుల కోసం రాష్ట్రానికి వస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఇది శుభ పరిణామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ సెంటర్లుగా ఐదు నగరాలను ఎంపిక చేశామని.. వీటిని పదిహేను నగరాలకు విస్తరించాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

## కొత్తపల్లిలో ఘనంగా పోచమ్మ తల్లి ఉద్వాసన, హోమం మహోత్సవం

### భక్తి పారావష్యంతో కళకలలాడిన గ్రామం - నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం



మే 04 ప్రజాకలం ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట)
వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లి గ్రామం సోమవారం భక్తి పరవశంతో కళకళలాడింది. గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లి ఉద్వాసన శాంతి హోమం, పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించగా, గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. దేవస్థానం కమిటీ చైర్మన్ కమ్మగోని సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ కౌడగాని సునీత–రాజేష్ కన్నా పర్యవేక్షణలో పూజారులు వేద మంత్రోచ్చారణల మధ్య శాంతి హోమాన్ని నిర్వహించారు. బ్రహ్మశ్రీ డాక్టర్ అత్తలూరి బాల శంకర శాస్త్రి నేతృత్వంలో జరిగిన ఈ హోమంలో అర్చకులు రాచమల్లె ప్రదీప్, పత్తిపాక శశికుమార్ శర్మ, దిలీప్ కుమార్ శర్మలు పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలు సంప్రదాయ దుస్తుల్లో మంగళహారతులు సమర్పిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి భక్తి, శ్రద్ధతో ఆలయ పరిసరాలు నినాదాలతో మార్మోగాయి. చిన్నారులు, యువత కూడా ఉత్సాహంగా పాల్గొని ఉత్సవాన్ని మరింత వైభవంగా మార్చారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ చైర్మన్ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, పోచమ్మ తల్లి కృపతో గ్రామానికి శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని కోరుకుంటూ మూడు రోజులుగా నిర్వహించిన శాంతి బోనాలు, హోమాలు, విజయవంతమయ్యాయని తెలిపారు. త్వరలో గ్రామ ప్రజల ఏకాభిప్రాయంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి, పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజేష్ కన్నా, వార్డు సభ్యులు అశోక్ గౌడ్, గ్రామ పెద్దలు యాదగిరి గౌడ్, వివిధ కులాల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తి, ఐక్యత, సంప్రదాయం కలిసిన ఈ వేడుక కొత్తపల్లికి కొత్త ఊపిరి నింపింది. ఆలయ నిర్మాణంతో గ్రామ ఆధ్యాత్మిక వైభవం మరింత పెరగనుంది.

## రైతు వారోత్సవంలో భూసార పరీక్షలపై అవగాహన

### దిగుబడుల పెంపుకు శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని సూచనలు అగ్రికల్చర్ ఆఫీసర్ విజయ్ కుమార్

మే 04 ప్రజాకలం ప్రతినిది: 0(వరంగల్ /వర్ధన్నపేట)
ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మండలంలోని ఆరు రైతు వేదికలలో నిర్వహించిన "రైతు వారోత్సవం" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యతపై వ్యవసాయ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. మట్టి నమూనాలను సరైన విధంగా ఎలా సేకరించాలి, ఎప్పుడు సేకరించాలి, ఏ ప్రాంతాల నుంచి తీసుకోవాలి వంటి అంశాలపై వివరణ ఇచ్చారు. భూసార పరీక్షల ద్వారా నేలలో పోషకాలు ఎంతమేర ఉన్నాయో తెలుసుకుని, తగిన ఎరువుల వినియోగంతో దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి రెవెన్యూ గ్రామానికి ముగ్గురు చొప్పున సాయిల్ శాంపిల్ వాలంటీర్లను నియమించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వాలంటీర్లు రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపడంతో పాటు, అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ



చేయడం జరిగిందని, వాటి ద్వారా భూమి ఆరోగ్య స్థితిని అంచనా వేసి పంటల ఎంపిక, ఎరువుల వినియోగంలో శాస్త్రీయ నిర్ణయాలు తీసుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ మాలోతు దేవేందర్, వ్యవసాయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## వేసవి ముంగిట ఎంపీ వరాల జల్లు

- ప్రజల దాహార్తి తీర్చేందుకు 43 చేతిపంపుల ఏర్పాటుకు పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శ్రీకారం
- రూ. 34.40 లక్షల ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు
- యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు.

ఖమ్మం మే 04(ప్రజా కలం న్యూస్ )
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని పలు మండలాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి నడుం బిగించారు. ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా తన ఎంపీ లాడ్స్ (వీూూాణూ) నిధుల నుంచి రూ.34.40 లక్షలతో కొత్త చేతిపంపుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ఏడాది మార్చిలోనే పలుచోట్ల చేతిపంపులు ఏర్పాటు చేయించగా.. 2025–26 ఆర్థిక సంవత్సర నిధులతోనే సత్తుపల్లి, మధిర, పాలేరు, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 20 మండలాల్లో ఈ పనులను చేపట్టేందుకు జిల్లా యంత్రాంగానికి ఆయన ఆదేశాలు జారీ చేశారు.
?మండలాల వారీగా నిధుల కేటాయింపు ఇలా..
ఉభయ జిల్లాల వ్యాప్తంగా మొత్తం 20 మండలాల్లో చేతిపంపుల ఏర్పాటు పనులను చేపట్టనున్నారు. ఏన్కూరు మండలంలో అత్యధికంగా 6 చేతిపంపుల కోసం రూ.4.80 లక్షలు మంజూరు చేయగా, లక్ష్మీదేవిపల్లి మండలంలో 5 చేతిపంపుల కోసం రూ. 4 లక్షల నిధులను కేటాయించారు. సింగరేణి మండలంలో 4 పంపులకు రూ. 3.20 లక్షలు, చంచుపల్లి, సుజాతానగర్, అశ్వారావుపేట మండలాల్లో 3 చేతిపంపుల చొప్పున ఒక్కో మండలానికి రూ.2.40 లక్షల నిధులు అందనున్నాయి.
?అదేవిధంగా వైరా, బోనకల్, మధిర, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో ఒక్కో మండలంలో రెండేసి చేతిపంపుల చొప్పున రూ. 1.60 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఇక కొణిజర్ల, ముదిగొండ, తల్లాడ, నేలకొండపల్లి, ఎర్రుపాలెం, కల్లూరు, కొత్తగూడెం, చంద్రుగొండ మండలాల్లో ఒక్కో చేతిపంపు ఏర్పాటుకు రూ.



80 వేల చొప్పున నిధులను కేటాయించారు. ఈ నిధులన్నీ కూడా గ్రామీణ నీటి సరఫరా విభాగం (=బొ) ద్వారా ఖర్చు చేయనున్నారు.

**యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి: ఎంపీ రఘురాం రెడ్డి**

ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 43 పనులకు వెంటనే పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ రఘురాం రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.
వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా..ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్య తలెత్తకుండా ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## హనుమకొండ డీసీసీ కార్యవర్గ సభ్యునిగా మామిండ్ల సురేష్ నియామకం

హనుమకొండ న్యూ శాయంపేట మే 04 ప్రజా కులం ప్రతినిధి



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వుల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు,జనరల్ సెక్రటరి,కార్యవర్గ సభ్యుల నియామకాలు ఖరారయ్యాయి. ఈ నియామకాల్లో భాగంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎంగల వెంకట్ రాం రెడ్డితో సంప్రదించి ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి రావాలని పీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్ న్యూ శాయంపేట కు చెందిన మామిండ్ల సురేష్‌కు జిల్లా కార్యవర్గ సభ్యునిగా అవకాశం దక్కింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నందున ఈ పదవి ఆయనకు దక్కింది.డీసీసీ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా మామిండ్ల సురేష్ పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వెంకటరాం రెడ్డి,ఎంపీ కడియం కావ్య, కార్పొరేటర్ మామిండ్ల రాజుకు,కాంగ్రెస్ నాయకులు భట్టి శ్రీనివాస్,ఈ వి శ్రీనివాస్,31 డివిజన్ స్థానిక కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నిధులు మంజూరు పట్ల మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ

మల్హర్, మే04 ప్రజాకలం ప్రతినిధి... భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలంలోని కొయ్యూరు గ్రామాభివృద్ధి కోసం సిఆర్ఆర్ నిధుల కింద రూ. 10 లక్షలు మంజూరు చేయడం పట్ల గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, గ్రామానికి నిధులు వచ్చేలా చొరవ చూపి, విశేష కృషి చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబుకు గ్రామస్తుల పక్షాన వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## రికార్డు స్థాయికి తెలంగాణ ఆదాయం

### ఏప్రిల్‌లో 35% వృద్ధి దూసుకుపోయిన జీఎస్టీ వసూళ్లు!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అత్యధిక వసూళ్లను నమోదు చేస్తూ చరిత్ర సృష్టించింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ (ఊూ) వసూళ్లలో 35 శాతం భారీ వృద్ధి నమోదైనట్లు వాణిజ్య పన్నుల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ చరిత్రలోనే అత్యధికంరాష్ట్రానికి ఏప్రిల్ 2026లో ఏకంగా రూ. 4,621 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ. 3,433 కోట్లుగా ఉండగా, ఇప్పుడు అదనంగా రూ. 1,188 కోట్లు వసూలైంది. జీఎస్టీ వ్యవస్థ అమలులోకి వచ్చినప్పటి నుండి ఒక నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే మొదటిసారి. వరుస విజయాలు: గత నాలుగు నెలలుగా తెలంగాణ జీఎస్టీ ఆదాయం స్థిరంగా రూ. 4,000 కోట్లకు పైగానే నమోదవుతోంది. మొత్తం ఆదాయం: జీఎస్టీతో పాటు పెట్రోల్, మద్యంపై వ్యాట్ (ఎఐ), వృత్తి పన్నులను కలుపుకుని మొత్తం రూ. 7,570 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి చేరింది. దేశంలోనే రెండో స్థానం: పన్ను వసూళ్ల వృద్ధి రేటులో కర్ణాటక తర్వాత తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచి తన ఆర్థిక సత్తాను చాటింది.

### తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లోకి

## మాజీ మంత్రి బోడ జనార్దన్

### టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీత్వరలోనే అనుచరులతో కలిసి పార్టీలో చేరనున్న మాజీ మంత్రి

హైదరాబాద్ :మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు బోడ జనార్దన్ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) లో చేరనున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ లో చేరుతానని తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ ను బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. బోడ జనార్దన్ ప్రస్తుత మంచిర్యాల జిల్లా చెన్నూరు శాసన సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్ టీ రామారావు ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు.

## ప్రియుడు ఫోన్ రీచార్జ్ చేయించలేదని మహిళ ఆత్మహత్య

హైదరాబాద్ : సహజీవనం చేస్తున్న ప్రియుడు ఫోన్ రీచార్జ్ చేయలేదని ప్రియురాలు ఆత్మహత్య చేసుకుంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని ప్రశాంత్ నగర్లో కిరణ్మి (26) 2015లో ప్రేమ వివాహం చేసుకుంది. భార్య భర్తల మధ్య గొడవలు జరిగి విడిపోగా, తన కొడుకుతో కొన్ని రోజులు తల్లి దగ్గరే ఉంటోంది. బ్యూటీషియన్ కోర్స్ నేర్చుకొని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ, వెంకటేష్ అనే వ్యక్తిని ప్రేమించి ఏడాదిగా అతనితో కిరణ్మయి సహజీవనం చేస్తోంది. రెండు రోజుల క్రితం తన ఫోన్ రీచార్జ్ అయిపోయిందని రీచార్జ్ చేయమని అడిగినా ప్రియుడు రీచార్జ్ చేయకపోవడంతో, అతనితో గొడవపడి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుంది. తన కూతురు మృతిపై వెంకటేష్ మీద అనుమానం వ్యక్తం చేస్తూ కిరణ్మయి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సొంత పార్టీ కార్యకర్తపై మండిపడ్డ ఎమ్మెల్యే

శింగనమల : తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి కార్యకర్తను అరెస్ట్ చేయించారు. ఎమ్మెల్యే ను ప్రశ్నించినందుకు సదరు కార్యకర్తను పోలీసులు ఈడ్చి పారేసారు. సొంత పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా పోలీసుల చేత ఎమ్మెల్యే అరెస్ట్ చేయించారు. అనంతపురం జిల్లా, శింగనమల నియోజకవర్గంలోని కనంపల్లిగ్రామంలో తమ సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చిన ఒక కుటుంబంపై ఎమ్మెల్యే బండారు శ్రావణి మండిపడ్డారు.

# విజన్-2047..

## ప్రభుత్వం ముందు పలు సవాళ్లు..!

**ప్రతి విత్తనాన్ని ట్రాక్ చేసే డిజిటల్ వ్యవస్థ రావాలి..! - నకిలీ విత్తనాల కేసుల్లో విచారణ వేగవంతంగా జరగాలి..**

**!రైతుల అవగాహన పెరగాలి..! - పరిశోధన సంస్థలు, పరిశ్రమలు, రైతుల మధ్య సమన్వయం పెరగాలి..!**

**వాతావరణ మార్పులకు తట్టుకునే విత్తనాభివృద్ధి అవసరం..! - నాణ్యత, పారదర్శకత, నమ్మకం కీలకం..!**

**రైతు చేతిలో నాణ్యమైన విత్తనం ఉంటేనే పంట బాగుంటుంది..! - పంట బాగుంటేనే రైతు బాగుంటాడు..!**

**రైతు బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుంది..! - విజన్ 2047 కేవలం లక్ష్యం కాదు.. రాష్ట్ర భవిష్యత్తుపై సామూహిక బాధ్యత..!**

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగాలనుకుంటున్న ఈ దశలో 'విజన్ 2047' ఒక సాధారణ ప్రభుత్వ ప్రణాళిక కాదు..ఇది భవిష్యత్తు తెలంగాణకు రూపకల్పన. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ల నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంతో రూపొందిన ఈ విజన్‌లో వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా విత్తన రంగానికి కీలక స్థానం ఉంది. ఇప్పటికే సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా పేరు తెచ్చుకున్న తెలంగాణను గ్లోబల్ సీడ్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పం గొప్పదైనప్పటికీ, ఆ లక్ష్యానికి వెళ్లే మార్గం అంత సులభం కాదు. అవకాశాలు ఎంత ఉన్నాయో, అంతే స్థాయిలో సవాళ్లు కూడా ముందున్నాయి.రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) ప్రభుత్వం విత్తన రంగానికి బలమైన పునాది వేసింది. తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, నిల్వ, పంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనల ద్వారా కొత్త విత్తన రకాల అభివృద్ధి, వాతావరణ మార్పులకు తట్టుకునే హైబ్రిడ్ల రూపకల్పనలో కీలక పాత్ర పోషించింది. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చి, నాణ్యమైన విత్తనాల వినియోగాన్ని ప్రోత్సహించాయి. సబ్సిడీ విత్తనాల పంపిణీ, సీడ్ హబ్‌ల ఏర్పాటు వంటి చర్యలు రైతులను ఉత్పత్తిదారులుగా మార్చి ఆదాయం పెంచాయి. ఈ సమగ్ర చర్యల ఫలితంగా తెలంగాణ దేశంలో విత్తన ఉత్పత్తిలో ముందుకు దూసుకెళ్తోంది.

నకిలీ విత్తనాల పెను సమస్య..!

అయితే ఈ విజయ గాథకు మరో వైపు కూడా ఉంది.. నకిలీ విత్తనాల పెను సమస్య. ప్రపంచానికి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తున్న రాష్ట్రంలోనే స్థానిక రైతులు నకిలీ విత్తనాల వల్ల నష్టపోవడం ఒక పెద్ద విషాదం. ప్రతి ఏడాది పంటలు విఫలమవడం, రైతులు అప్పుల పాలవడం, నమ్మకం కోల్పోవడం వంటి పరిణామాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. 2025 అక్టోబర్ వరకు వందల క్వింటాళ్ల నకిలీ విత్తనాలు సీజ్ చేయడం, 120కి పైగా కేసుల నమోదు, 150 మందికి పైగా అరెస్టులు చేయడం.. దీన్ని బట్టి సమస్య ఎంత లోతుగా ఉందో మనకు అర్థమవుతుంది.నివారణా చర్యల దిశగా..ప్రస్తుతం రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ప్రివెంటివ్ యాక్షన్' దిశగా ప్రభుత్వం కదులుతోంది. క్షేత్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచడం, విత్తన దుకాణాలు, గోదాములపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, అనుమానాస్పద విత్తనాలను ల్యాబ్‌లకు పంపించి పరీక్షించడం వంటి చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా పత్తి, మిరప, సోయాబీన్ విత్తనాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. లూజు విత్తనాల విక్రయాలపై కఠినంగా నిషేధం విధించడం కూడా ఒక కీలక చర్య.ప్రత్యేక సీడ్ బిల్లుకు కసరత్తు..దేశస్థాయిలో చట్టపరంగా కూడా కట్టుదిట్టమైన మార్పులు జరుగుతున్నాయి. కేంద్రం తీసుకొచ్చిన 'సీడ్ బిల్– 2025' ద్వారా ప్రతి విత్తనానికి తప్పనిసరి నమోదు, ఖీఖీ కోడ్ ఆధారిత ట్రేసబిలిటీ, భారీ జరిమానాలు, జైలు శిక్షలు వంటి నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రత్యేక సీడ్ చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. లైసెన్స్ ఉన్న కంపెనీలకే అనుమతి, ఫార్మర్–కంపెనీ ఒప్పందాలు తప్పనిసరి చేయడం, దళారుల వ్యవస్థను తగ్గించడం వంటి కీలక చర్యలు తీసుకుంటోంది.అయితే చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు మాత్రం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. మార్కెట్‌లో లూజు విత్తనాల




విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరలకు విత్తనాలు అమ్మడం, బిల్లుల్లో తక్కువ ధర చూపించడం, రైతులను షరతులతో బంధించడం వంటి అక్రమాలు జరుగుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల నుంచి చౌక విత్తనాలు తెచ్చి విక్రయించడం, కొన్నిచోట్ల అధికారుల తనిఖీలు లేకపోవడం సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. అంటే సమస్య కేవలం చట్టాల లోపం కాదు.. చట్టాన్ని కఠినంగా అమలు చేయలేక పోవడం ఉంది.

చర్యలు వేగవంతం..

ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని చర్యలు వేగవంతం చేసింది. ప్రత్యేక డ్రైవ్‌లు, కంట్రోల్ రూమ్‌లు, రైతుల ఫిర్యాదులకు తక్షణమే స్పందించడం, లైసెన్స్ రద్దు, క్రిమినల్ కేసులు వంటి చర్యలు కొనసాగుతున్నాయి. అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను గుర్తించే మార్గాలను తెలియజేయడం జరుగుతోంది. అయినప్పటికీ, దళారుల ప్రభావం పూర్తిగా తగ్గకపోవడం ఒక పెద్ద సవాలు.విజన్ – 2047 లక్ష్యం మాత్రమే కాదు....'గ్లోబల్ సీడ్ క్యాపిటల్' లక్ష్యం సాధించాలంటే తెలంగాణ ముందుగా తన అంతర్గత వ్యవస్థను బలోపేతం చేయాలి. నాణ్యత నియంత్రణలో రాజీ పడకూడదు. ప్రతి విత్తనాన్ని ట్రాక్ చేసే డిజిటల్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. నకిలీ విత్తనాల కేసుల్లో వేగవంతమైన న్యాయ ప్రక్రియ ఉండాలి. రైతుల అవగాహన పెరగాలి. పరిశోధన సంస్థలు, పరిశ్రమలు, రైతుల మధ్య సమన్వయం పెరగాలి. వాతావరణ మార్పులకు తట్టుకునే విత్తనాల అభివృద్ధి కూడా అత్యవసరం. ఏది ఏమైనప్పటికీ తెలంగాణ 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా ఎదగడం ఒక గొప్ప విజయమే. కానీ 'గ్లోబల్ సీడ్ క్యాపిటల్'గా మారాలంటే నాణ్యత, పారదర్శకత, నమ్మకం అనే మూడు సూత్రాలను కచ్చితంగా పాటించాలి. రైతు చేతిలో నాణ్యమైన విత్తనం ఉంటేనే పంట బాగుంటుంది, పంట బాగుంటేనే రైతు బాగుంటాడు.. రైతు బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుంది. అందుకే విజన్ 2047 ఒక లక్ష్యం మాత్రమే కాదు..అది తెలంగాణ భవిష్యత్తుపై ఒక సామూహిక బాధ్యత. ప్రభుత్వం, రైతులు, పరిశోధన సంస్థలు అన్నీ కలిసి పనిచేసినప్పుడే ఈ లక్ష్యం సాకారం అవుతుంది.

# కుట్టుమిషన్ల పంపిణీలో అక్రమాలు

మెదక్ : ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి కుట్టుమిషన్ల పంపిణీపై అప్పుడే అనుమానాలు మొదలయ్యాయి. రూ.కోట్లు పక్కదారి పట్టించేందుకే ఇలాంటి పథకాలను తీసుకొస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి. గతంలో పలు పథకాలను అమలు చేసే సందర్భంలో టెండర్ల నుంచి మొదలుకుని లబ్ధిదారుల ఎంపిక వరకు తీవ్ర విమర్శలు వచ్చిన సందర్భాలను వారు ఎత్తిచూపుతున్నారు. తాజాగా ప్రతి ని యోకవర్గానికి వెయ్యి కుట్టుమిషన్లను అందిస్తామంటూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొ న్నం ప్రభాకర్ ప్రకటించిన నేపథ్యంలో అం దరిలోనూ మరోసారి చర్చను రేకెత్తించింది. ఈ పథకంలోనూ అవినీతి, అక్రమాలు జరుగుతాయని కొందరు చర్చించుకుంటున్నారు.గతంలో పలు కొత్త పథకాలు అమలు చేయడంలో వచ్చిన ఆరోపణలు, లబ్ధిదారుల ఎం పిక, టెండర్ల ఎంపికలో వెల్లువెత్తిన అక్రమాలు, అవినీతి ఆరోపణలు వచ్చిన నేప థ్యంలో కుట్టుమిషన్ల పంపిణీలో ఇలాంటి వాటికి ఆస్కారం ఉండకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ సందర్భంగానే రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ప్రజలు పలు సూచనలు చేస్తున్నారు. బీసీల్లోని నిరుపేదలకు కుట్టుమిషన్లన అందిం చాలనేది అందరూ స్వాగతిస్తున్న అంశమే.అయితే ఇలా కుట్టుమిషన్లను అందించే ప్రక్రియలో పారదర్శకత, మార్గదర్శకాల అమలు పైనే అందరూ చర్చిస్తూ అవినీతి, అక్రమాలకు ఇక్కడే శ్రీకారం చుడతారనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకుగాను ఒక్కో నియోజవర్గానికి వెయ్యి కుట్టుమిషన్లను అందించి.. బీసీ నిరుపేద కుటుంబాలకు ఉపాధిని పెం పొందించేలా చూడటానికి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కుట్టుమిషన్ల పంపిణీని చేపట్టనున్నారు. అంటే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.20 లక్షల కుట్టుమిషన్లను పం పిణీ చేయనున్నారు.వాస్తవానికి టెండర్ల విషయంలో ఏదైనా అవినీతికి ఆస్కారం కలుగుతుంది. టెండరుదారుల అర్హతలను నిర్ణయించడమే ఈ అక్రమాలకు శ్రీకారం చుడుతుంది. గతంలోలాగా ఆంధ్రాకు చెం దిన బడా కాంట్రాక్టర్లకు ఈ టెండర్లు దక్కేలాగా అర్హతలు ఉండకుండా కనీసం ఐదారు గురికి అదీ తెలంగాణవారికి టెండర్లు వచ్చేలాగా అర్హతలను నిర్ణయిస్తే అవినీతికి ఆస్కా రం లేకుండా ఉంటుందని మేధావులు సై తం అంటున్నారు. అలాగే కుట్టుమిషన్లను సరఫరా చేసేవారిలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) వారికికూ డా అవకాశం దక్కేలా చూడాలని వారంటున్నారు. దీంతోపాటు మహిళా వ్యాపారవే త్తలకు, 25 శాతం ఎస్సీ వ్యాపారవేత్తలకు టెండర్లు దక్కేలా మార్గదర్శకాలు రూపొందిస్తే స్థానికులకు వ్యాపార అవకాశాలు ఇచ్చి నట్టవుతుందని వారంటున్నారు.ఇక ఒక్కో కుట్టుమిషన్‌కు ధర ఎంత అనే ది నిర్ణయించడంలోనే అసలైన ఆరోపణలు వస్తాయని వారు సూచిస్తున్నారు. బహిరంగా మార్కెట్‌లో ఒక్కో కుట్టుమిషన్ ధర కంటే 1.20 లక్షల కుట్టుమిషన్లకు తక్కువ ధరకే వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం టెండరుదారులతో సమావేశం ఏర్పాటుచేసి ఎవరు తక్కువ ధరకు ఇస్తే వారికి టెండర్లు ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి (బీసీ సంక్షేమం) నిధులు మిగులుతాయని వారంటున్నారు. అలా కాకుండా గతంలో అనేక పథకాల



విషయంలో జరిగినట్టుగానే ధరలను రెట్టింపు చేసి ప్రజా ధనాన్ని లూటీ చేసేలా లోపాయికారీ ఒప్పందాలకు వెళ్లకుండా చూడాలని వారం టున్నారు.ఇలా జరిగితే ప్రభుత్వంపై మరోసారి అవినీతి, అక్రమాల ఆరోపణలు, విమ ర్శలు రావడం ఖాయమని, దీనివల్ల ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి తలెత్తి అంతి మంగా ప్రభుత్వానికే నష్టం వాటిల్లుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత అవసరమని ప్ర జలు అంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాల లబ్ధిదారుల ఎంపికలో వచ్చినట్టుగా అవినీతి ఆరోపణలు రాకుండా ఉ ండేలా బీసీల్లో ఉన్న కిందిస్థాయి వర్గాల నుంచి ఎంపిక జరగాలని వారంటున్నారు. రాజకీయ పక్షాల ప్ర భావం ఉండకుండా.. పారదర్శకంగా ఎంపిక ఉండాలని ప్రజలు కోరుతున్నారు.రైతు బంధులాగా నేరుగా బెనిఫిట్ ట్రా న్స్‌ఫర్ (డీబీటీ) విధానం అయితే మరీ మం చిదని మేధావులు సూచిస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి వారి బ్యాంకు ఖాతా ల్లోకి కుట్టుమిషన్‌కు నిర్ణయించిన ధర మొ త్తాన్ని బదిలీ చేస్తే ప్రభుత్వం గుర్తించిన టెండరుదారుల నుంచి వారే నేరు గా కుట్టుమిషన్లను కొనుగోలు చేసే అవకాశం ఉంటుం ది. పైగా లబ్ధిదారుల అవసరాలమేరకు సొంతంగా మరికొం త డబ్బు కలిపి కొత్త కొత్త సౌకర్యాలతో ఉన్న కుట్టుమిష న్లు కొనుగోలు చేసుకునే అవకాశాం కల్పిస్తే మరింత ఉపయుక్తంగా ఉం టుందని ప్రజలు అంటున్నారు.ఇదీ కాకుం డా రాష్ట్రం మొత్తం ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు అప్పజెప్పకుండా మొత్తం 33 జిల్లాలకు ఒకరిద్దరి చొప్పున కుట్టుమిషన్ల సరఫరాదారు లు ఉండేలా జాగ్రత్త వహిస్తే మరింత పారదర్శకంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకు లు అభిప్రాయపడుతున్నారు. జిల్లాల వారీ గా కాంట్రాక్టర్లను ఎంపికచేస్తే స్థానికంగా ఉండే ఎంఎస్ఎంఈలకు అవకాశంగా ఉ ం టుందని వారంటున్నారు. ఇక ప్రభుత్వం ఏం చేస్తుందో.. ఎలా చేస్తుందో.. చూడాలి..!అంతంత మాత్రంగానే ఉన్న బీసీ సంక్షే మ శాఖ బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల కుట్టుమిషన్ల పం పిణీ కోసం ఖర్చు పెట్టాలనే ఆలోచనతో ప్ర భుత్వం ముందుకు వెళ్తున్నట్టు సమాచారం.

# హైడ్రా బాధితులకు 'డబుల్' ఊరట

హైదరాబాద్ : భాగ్యనగరంలోని చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన పేదల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మానవీయమైనది. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతూనే, పేదలకు అన్యాయం జరగకూడదన్న సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ చెరువుల పునరుద్ధరణ పనుల వల్ల నివాసం కోల్పోయిన పేద కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న క్రమంలో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు డబుల్ ఇళ్లను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ నిర్ణయంపై సామాన్యుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. పేదలకు అండగా ఉంటూనే, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. అర్హులను గుర్తించడంలో అవకతవకలు జరగకుండా హైడ్రా అత్యాధునిక సాంకేతికతను వాడుతోంది. జూలై 19, 2024 కు ముందు చెరువు పరిసరాల్లో నివాసం ఉన్న వారిని శాటిలైట్ చిత్రాలు, గూగుల్ మ్యాప్స్, తదితరాల ఆధారంగా గుర్తిస్తున్నారు. పేదల పేరుతో చేసే దుష్ప్రచారానికి తావు లేకుండా, పక్కా ఆధారాలతో అర్హత కలిగిన పేద కుటుంబాల జాబితా సిద్ధం చేస్తున్నారు. కేవలం డిజిటల్ ఆధారాలే కాకుండా, క్షేత్రస్థాయిలో సర్వేలు కూడా నిర్వహించి లబ్ధిదారులకు గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బాధితులతో ముఖాముఖి ఇటీవల హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాదాపూర్‌లోని సున్నం చెరువు, రామంతపూర్ చెరువు బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ



సమావేశంలో నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ వంటి జిల్లాల నుంచి వలస వచ్చిన కార్మికులు, చెత్త ఏరే వారు తమ బాధలను కమిషనర్‌కు వివరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కమిషనర్, అర్హులైన ప్రతి ఒక్కరికీ శాశ్వత నివాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో చెరువులను కబ్జాల నుంచి విముక్తి చేసి, వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడడంలో హైడ్రా విజయవంతమైంది. చెరువుల పునరుద్ధరణలో హైడ్రా తీసుకుంటున్న విధానాలను చెన్నై అధికారులు ప్రశంసించడం విశేషం. కబ్జాదారులపై కఠినంగా వ్యవహరిస్తూనే, నిజమైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ చర్యల ద్వారా స్పష్టం అవుతోంది. హైడ్రా చర్యలు కేవలం కూల్చివేతలకు మాత్రమే పరిమితం కాకుండా.., పేదల పునరావాసంపై దృష్టి సారించడం అభినందనీయం. అభివృద్ధి పేరిట పేదలను రోడ్డున పడేయకుండా, వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ద్వారా శాశ్వత గూడు కల్పించడం ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుతోంది. ఒకవైపు చెరువులను కాపాడుకుంటూనే, మరోవైపు పేదలకు అండగా నిలవడం భాగ్యనగర భవిష్యత్తుకు శుభసూచకం.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

రాయచోటి : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మదనపల్లి కలెక్టరేట్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదు అయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా... సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ కాగానే బాధితులకు పరిహారం అందజేసేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులకు సూచించారు. 2025 సెప్టెంబర్ 10 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వరకు జిల్లాలో మొత్తంగా 14 ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు అయి విచారణ దశలో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కేసువారీగా పరిష్కార చర్చపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. కేసులలో ఎప్పటి కప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయడం తో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తిచేయాలని అన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రతినెల క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను సంబంధిత తాసిల్దారులు వెంటనే జారీ చేయాలని, డివిజన్ స్థాయి అధికారులు దీనిని తగిన పర్యవేక్షించాలని సూచించారు. స్పీడ్ కేసులలో త్వరితగతిన జడ్జిమెంట్ వచ్చేలా పోలీస్, న్యాయశాఖ పిపీలు కృషి చేయాలని తెలిపారు. జిల్లా నందలి ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జలధార కార్యక్రమం వల్ల జిల్లాలో భూగర్భ జలాలు, నీటి వనరులు పెరిగాయి. ప్రతి గ్రామంలో ఆసక్తి గలవారికి పాలిచ్చే పశువులు పెంచుకునేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ మేరకు ఎస్సీ ఎస్టీలను కూడా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. మాన్సూన్ సీజన్ మొదలయ్యేలోపు ఆసక్తి గలవారు ముందుకు వస్తే డిఆర్డిఏ శాఖ ద్వారా ఎస్సీ ఎస్టీల మహిళ సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.... జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. ఇప్పటికే నమోదైన అండర్ ట్రయల్ కేసులు, వాటి పరిష్కారం కొరకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్డిపిఓలు, డీవీఎంసీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల ప్రగతి, ఆయా అంశాలలో తీసుకున్న చర్యలపై డివిఎంసి సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్ మరియు ఎస్పి సందేహ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో అన్ని మండలాలలో ఎస్సీ, ఎస్టీల స్మశాన వాటికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కమిటీ సభ్యులు కలెక్టర్కు విన్నవించారు. ఈ అంశాలను ప్రత్యేక దృష్టితో సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిటీ సభ్యులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.అంతకుముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు పరిష్కరించిన కేసులపై సమావేశంలో చర్చించి, ఇంకనూ తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్, ఎస్పీ అధికారులకు పలు సూచనలు జారీ చేశారుఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.శ్రీరాములు, డీఎస్పీలు, డివిఎంసి సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ, శ్రీనివాసులు, రాజశేఖర్, చంద్రశేఖర్ బోడేషావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

# పోలవరం పై కేంద్రం సంచలన నిర్ణయం



అమరావతి : ఆంధ్రుల కల అయిన పోలవరం ప్రాజెక్ట్ విష యంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది పోలవరానికి ఒక డెడ్ లైన్ ని పెట్టి మరీ పూర్తి చేయాలని కేంద్రం భావించడం మంచి పరిణామంగా భావిస్తున్నారు. తాజాగా చూస్తే పోలవరం విషయంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుందనే అంతా అంటున్నారు. పోలవరం ప్రాజెక్టుని 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఒక సుదీర్ఘమైన కల నెరవేరే అవకాశాలు ఉన్నాయి. పోలవ రం ప్రాజెక్టు నిజానికి జాతీయ ప్రాజెక్టుగా ఉంది. 2014 ఆంధ్రప్రదేశ్ లో కూడా పోలవరం ప్రాజెక్టు గురించి ఆనాటి ప్రభుత్వాలు నిర్మాణం కోసం పెద్ద ఎత్తున కృషి చేశాయి. అయితే విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టుని పెట్టి జాతీయ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికి 12 సంవత్సరాలు కాలం పూర్తయి రెండు ప్రభుత్వాలు మారి మూడో ప్రభుత్వంగా మరోసారి కూటమి అధికారంలోకి వచ్చింది. అయితే కూటమి 2024 లో అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి పోలవరం ప్రాజెక్టు చేయాలని దృఢ సంకల్పంతో ఉంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ఇతోధికంగా నిధుల రూపంలో సహాయాన్ని పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని ప్రయత్నం చేస్తూ వస్తోంది. దానికి ప్రతిస్పందనగా కేంద్రం నుంచి తగ్గిన రీతిని సహాయ సహకారాలు అందుతోంది. తాజాగా చూస్తే కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు విషయం ఒక కీలకమైన అడుగు వేసింది. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాదు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి 3,300 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి అందించేందుకు కూడా కేంద్రం సంసిద్ధంగా ఉన్నట్టుగా పేర్కొంది. ఈ మధ్యనే కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కోసం 2, 300 కోట్ల రూపాయలు నిధులను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దానికి జతగా మరో విడతగా ఈ మూడు వేల 300 కోట్ల రూపాయలు విడుదల చేయడం అంటే పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని అర్థం అవుతోంది. మరో వైపు చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుని ఎట్టి పరిస్థితుల్లో వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తారని ప్రకటించారు. పుష్కరాలు జూలై నెలలో వస్తున్నాయి అంటే రాష్ట్ర ప్రభుత్వం కూడా జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలన్న కృత నిశ్చయంతో ఉన్నట్టుగా కనిపిస్తోంది. అలా కేంద్రం రాష్ట్రం పోలవరం విషయంలో ఒకే మాట మీద ఉన్నాయని అంటున్నారు. పోలవరం ప్రాజెక్టుకి నిధుల కొరత లేకుండా కేంద్రం కూడా పచ్చ జెండా ఊపడంతో దాదాపుగా 85 ఏళ్ల నాటి పోలవరం కల ఆంధ్రులకు నెరవేరె అవకాశం ఉందని అంటున్నారు. పోలవరం ప్రాజెక్టు కనుక పూర్తి అయితే గోదావారి జిల్లా ప్రాంతాలతో పాటు కోస్తా జిల్లాలకు కూడా తాగు నీరు, సాగునీరు లభిస్తుంది అదేవిధంగా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా కూడా పోలవరం ఉండడంతో రానున్న రోజుల్లో రాష్ట్రానికి ఒక సంపదగా మారుతుందని ఆశాభావం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు అమరావతి పోలవరం రెండు విషయాల మీదనే పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ రెండు విభజన ఆంధ్ర ప్రదేశ్ దశను దిశను మారుస్తాయని చంద్రబాబు నాయుడు పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా పోలవరం ప్రాజెక్టు తగిన సహాయం అందించేందుకు ముందుకు రావడం శుభ పరిణామమని పేర్కొంటున్నారు.

# బన్నీతో మూవీ.. లోకేష్ ప్లాన్ ఎలా ఉంది?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఒకవైపు కోలీవుడ్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న రాకా షూటింగ్ కొనసాగుతుండగా, మరోవైపు తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో చేయబోయే ప్రాజెక్ట్ పై ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఆ కాంబినేషన్ ప్రకటించినప్పటి నుంచే అభిమానుల్లో, సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. లోకేశ్ కనగరాజ్ గతంలో తీసిన వివిధ సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు సాధించినప్పటికీ, ఆయన కంప్లీట్ టాలెంట్ ను ఇంకా చూపలేదనే అభిప్రాయం కొందరిలో ఉంది. ఈ నేపథ్యంలో బన్నీతో చేయబోయే సినిమా ఆయన కెరీర్ లో కీలక మలుపు అవుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ప్రాజెక్ట్ గురించి లోకేశ్ సన్నిహితుడు, కో రైటర్ రత్న కుమార్ చేసిన వ్యాఖ్యలు మరింత హైప్ తీసుకొచ్చాయి. “ఇది పూర్తిగా ఒరిజినల్ లోకేష్ స్టైల్ సినిమా. స్క్రిప్ట్ ఇప్పటికే స్ట్రాంగ్ గా సిద్ధమైంది. ఈసారి లోకేశ్ లో ఉన్న కసి, ఫైర్ మరో లెవెల్ లో కనిపిస్తుంది” అని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా ఖైదీ, విక్రమ్ సమయాల్లో కనిపించిన ఎనర్జీ మళ్లీ రిపీట్ అవుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. లోకేష్ కనగరాజ్ లోని పీక్ టాలెంట్ ను చూస్తారని చెప్పి ఒక్కసారిగా రత్న కుమార్ అంచనాలు పెంచారు. ఇక ఆ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తోంది. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన అనౌన్స్మెంట్ మ్యూజిక్ వీడియో సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. బన్నీ మాస్ ఇమేజ్ కు అనిరుధ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కలిస్తే థియేటర్లలో కొత్త రికార్డులు నమోదు కావడం ఖాయం అన్న అభిప్రాయం ఫ్యాన్స్ లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం బన్నీకి పుష్ప సిరీస్ చిత్రాలతో వచ్చిన పాన్ ఇండియా ఇమేజ్ మరింత పెరిగింది. ఆ సినిమాతో ఆయన రేంజ్ గ్లోబల్ స్థాయికి చేరింది. అందుకే AA23ను కేవలం సౌత్ కే పరిమితం చేయకుండా, అంతర్జాతీయ మార్కెట్ ను దృష్టిలో పెట్టుకుని రూపొందించాలనే ప్లాన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అట్లీ ప్రాజెక్ట్ పూర్తయ్యాక లోకేశ్ సినిమా సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. వచ్చే ఏడాది స్టార్టింగ్ లో షూటింగ్ ప్రారంభం కావచ్చని అంచనా. ప్రస్తుతం లోకేశ్ ఆ స్క్రిప్ట్ పై పూర్తిగా ఫోకస్ పెట్టి మరింత పదును పెడుతున్నట్లు సమాచారం. మొత్తానికి బన్నీ, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్, స్టైలిష్ టేకింగ్, స్ట్రాంగ్ కంటెంట్ అన్నీ కలిసొస్తే ఆ సినిమా సౌత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో కొత్త మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. ఫ్యాన్స్ అయితే ఇదే లోకేష్ పీక్స్ మూవీ అవుతుందని ఇప్పుడే నమ్మకంగా చెబుతున్నారు.

# కవర్ పేజీపై సారా అర్జున్ మైండ్ బ్లోవింగ్ ఫోజులు



సారా అర్జున్.. ఈ పేరు వినగానే మనకు నాన్న (దైవ తిరుమగళ్) చిత్రంలో విక్రమ్ కుమార్తెగా నటించిన ఆ చిన్నారి గుర్తుకు వస్తుంది. కానీ ఇప్పుడు ఆ చిన్నారి 20 వయసు డ్రీమ్ గాళ్ గా ఎదిగింది. భారతీయ చిత్ర పరిశ్రమలో నెక్స్ట్ బిగ్ థింగ్‌గా అవతరించింది. తాజాగా ఎల్లే ఇండియా డిజిటల్ కవర్ స్టార్‌గా మెరిసిన సారా.. తన కెరీర్– వ్యక్తిగత ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను షేర్ చేసింది. కేవలం అందం మాత్రమే కాకుండా.. నటన లో తనకు ఉన్న పరిణతి ఎల్లే కవర్ స్టోరీ ఇంటర్వ్యూలో స్పష్టంగా రివీలైంది. ప్రస్తుతం ధురంధర్ ఫ్రాంచైజీతో బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల వసూళ్లను చూసిన సారా ఈ విజయంపై చాలా స్పష్టతతో ఉంది. ప్రస్తుతం తనచుట్టూ జరుగుతున్నవన్నీ చూస్తుంటే చాలా కృతజ్ఞతగా ఉందని.. కానీ ఈ క్షణం విలువను నేను భవిష్యత్తులో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు మాత్రమే పూర్తిగా అర్థం చేసుకోగలనని తెలిపింది. తన దృష్టి అంతా జీవితంలోని తదుపరి అధ్యాయంపైనే ఉందని కూడా సారా పేర్కొన్నారు. సినిమా ఇండస్ట్రీలోనే పెరగడం వల్ల ఇక్కడి గెలుపోటములు.. అనిశ్చితిపై తనకు పూర్తి అవగాహన ఉందని కూడా సారా పేర్కొంది. నటన గురించి సారా చెబుతూ.. కెమెరా ముందుకు వచ్చినప్పుడు నేను సారా అనే వ్యక్తిని పూర్తిగా మర్చిపోతాను. మరొకరి పాత్రను పోషిస్తున్నప్పుడు మనలోని అడ్డంకులు, బిడియం అన్నీ తొలగిపోతాయి. నాకు నటన అంటే అందరూ నన్ను చూడటం కాదు.. ఆ పాత్రలో నేను లీనమైపోవడం– అని తన వృత్తి పై ఉన్న కసిని సారా చాటుకుంది. కేవలం 20 ఏళ్ల వయస్సులోనే ఇంతటి స్థిరమైన ఆలోచనా ధోరణి తనను ఉన్నత స్థాయిలో నిలబెడుతుందనడంలో సందేహం లేదు.తాను గ్లామర్ ప్రపంచంలో ఉన్నా నిజాయితీగా ఉండటమే ముఖ్యమని నమ్ముతానని సారా చెబుతోంది. ప్రేక్షకులు ఎప్పుడూ నిజాయితీకి, పర్ఫెక్షన్‌కు మధ్య ఉన్న తేడాను గుర్తించగలరు. అందుకే నేను ఎప్పుడూ నిజాయితీగా ఉండటానికే ప్రయత్నిస్తాను! అని సారా తెలిపారు. ఫ్యాషన్ అండ్ స్టైలింగ్ విషయంలో కూడా సారా తనదైన ముద్ర వేస్తోంది. ఎల్లే కవర్ పేజీపై సారా గ్లామర్ డోస్ దుమారం రేపుతోంది. ముఖ్యంగా సారా కోసం ఎంపిక చేసుకున్న ప్రయోగాత్మక బ్లేజర్లు.. థై సొగసుల్ని ఎలివేట్ చేసే డిజైనర్ దుస్తులు తనలోని గ్లామ్ యాంగిల్ ని మరో లెవల్లో ఆవిష్కరించాయి. ఎల్లే షూట్ కోసం స్టెల్లా మాక్‌కార్ట్నీ.. ధ్రువ్ కపూర్ వంటి ప్రముఖ డిజైనర్ల దుస్తులలో అద్భుతంగా కనిపించారు. మొత్తానికి చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టి నేడు వేల కోట్ల వసూళ్లు సాధించిన చిత్రాల్లో నటిగా ఉన్న సారా అర్జున్ భవిష్యత్ లో భారతీయ సినిమాను ఏలబోయే స్టార్ హీరోయిన్‌గా కనిపిస్తోంది. ఈ ప్రతిభావని నటనలోని సహజత్వం.. కెరీర్ జర్నీపై ఉన్న స్పష్టత తనను ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం నిలబెడతాయని చెప్పడంలో సందేహం లేదు.

# జెట్ లీ వివాదం: టాలీవుడ్ పెద్దలు పట్టించుకోరా?




సినిమా ఇండస్ట్రీలో ఏదైనా సమస్య వస్తే పెద్దలు ముందుండి పరిష్కరిస్తారని అందరూ ఆశిస్తారు. కానీ ఇప్పుడు టాలీవుడ్ డిస్ట్రిబ్యూషన్ రంగంలో జరుగుతున్న ఒక వివాదాన్ని చూస్తుంటే సీన్ రివర్స్ అయినట్లు కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ‘జెట్ లీ’ సినిమా చుట్టూ ఇప్పుడు తెలంగాణలో పెద్ద వివాదమే నడుస్తోంది. ఒకవైపు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు సాగుతుంటే, మరోవైపు ఇండస్ట్రీలో కీలక పాత్ర పోషించే పెద్దలు మాత్రం మౌనంగా ఉండటం చర్చనీయాంశమైంది. సాధారణంగా థియేటర్ల దగ్గర గొడవలు వస్తే అవి చర్చల ద్వారా ముగిసిపోతాయి. కానీ ఇక్కడ వ్యవహారం హద్దులు దాటినట్లు కనిపిస్తోంది. మైత్రీ సంస్థను టార్గెట్ చేస్తూ తెలంగాణలోని ఇతర డిస్ట్రిబ్యూటర్లు ‘జెట్ లీ’ సినిమాను గట్టిగానే అడ్డుకుంటున్నారని టాక్ వస్తోంది. సింగిల్ స్క్రీన్లలో అద్దెకు సంబంధించిన సమస్యలు ఉండటమే కాకుండా, ఇప్పుడు ఏకంగా మల్టీప్లెక్స్ లలో కూడా సినిమా ప్రదర్శన నిలిచిపోవడం సంచలనం సృష్టిస్తోంది. ఇది కేవలం వ్యాపార పోటీనా లేక కావాలనే ఒక సినిమాను తొక్కేసే ప్రయత్నమా అనే అనుమానాలు తలెత్తుతున్నట్లు మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ గొడవ ఇలా ముదురుతున్నా టాలీవుడ్ కు చెందిన అగ్ర హీరోలు లేదా ఇండస్ట్రీ పెద్దలు ఎవరూ దీనిపై స్పందించడం లేదు. ఇండస్ట్రీలో ఏ సమస్య వచ్చినా సెటిల్ చేసే కొందరు సీనియర్ స్టార్స్, ఇప్పుడు ఈ గొడవలో తలదూర్చడానికి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని ఫిలిం నగర్ టాక్. సాధారణంగా ఇలాంటి విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకునే పెద్దలు ఇప్పుడు సైలెంట్ గా ఉండటం వల్ల పరిస్థితి మరింత సీరియస్ గా అనిపిస్తోంది. ఎవరికి వారు తమ పనుల్లో బిజీగా ఉండటం వల్ల ఈ వివాదం ఒక కొలిక్కి రావడం లేదని ఇన్ సైడ్ సర్కిల్స్ సమాచారం. ఒక పెద్ద నిర్మాణ సంస్థకు ఇలాంటి ఇబ్బందులు ఎదురైనప్పుడు చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ఇండస్ట్రీకి ఎప్పుడూ క్షేమకరం. కానీ ఇక్కడ మల్టీప్లెక్స్ స్క్రీన్లను కూడా అడ్డుకోవడం అనేది ఒక రకమైన ఆధిపత్య ధోరణిలా కనిపిస్తోందని విమర్శలు వస్తున్నాయి. ఒక సినిమా విడుదలను అడ్డుకోవడం వల్ల కేవలం నిర్మాతలకే కాదు, దానిపై ఆధారపడ్డ ఎంతో మంది కార్మికులకు కూడా నష్టం వాటిల్లుతుంది. అయినా సరే, ఇండస్ట్రీలో సంక్షోభం వచ్చినప్పుడు స్పందించే పెద్దలు ఈ ఇష్యూను పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతానికి ఈ ‘జెట్ లీ’ వివాదం ఒక పంతం లాగా మారిపోయిందని కామెంట్స్ కూడా వస్తున్నాయి. ఒకవైపు మైత్రీ సంస్థ సోషల్ మీడియాలో తమ వాదనను బలంగా వినిపిస్తోంది. మరోవైపు డిస్ట్రిబ్యూటర్ల వైపు నుంచి కూడా ఒత్తిడి తగ్గడం లేదు. ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరాలంటే పెద్దల జోక్యం తప్పనిసరి అని మరికొందరు భావిస్తున్నారు. లేదంటే ఈ ఎఫెక్ట్ రాబోయే మరికొన్ని సినిమాలపై కూడా పడే ఛాన్స్ ఉంది. మరి ఇప్పటికైనా టాలీవుడ్ పెద్దలు స్పందించి ఈ గొడవకు ఫుల్ స్టాప్ పెడతారో లేదో చూడాలి.

# షార్ట్ స్కర్ట్ లో మాళవిక మోహనన్



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ మారుతీ దర్శకత్వంలో వచ్చిన ది రాజా సాబ్ సినిమా ద్వారా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది మాళవిక మోహనన్. మలయాళీ ముద్దుగుమ్మ అయిన ఈమె తొలిసారి తెలుగు ప్రేక్షకులను తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఈ సినిమాలో యాక్షన్ పర్ఫామెన్స్ తో అదరగొట్టేసింది. ప్రభాస్ తో వచ్చిన సన్నివేశాలు మరింత హైలెట్గా నిలిచాయి. బోలెడు ఆశలతో ఈ సినిమా సక్సెస్ అవుతుందని ఎదురుచూసిన అమ్మడికి నిరాశ మిగిలింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలవడంతో అభిమానులు కూడా జీర్ణించుకోలేకపోయారు. కానీ ఇందులో మాళవిక నటనకు మంచి మార్కులే పడ్డాయి. అలా మొదటి సినిమాతో తన నటనతో తెలుగు ఆడియన్స్ హృదయాలను దోచుకుంది మాళవిక. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరించే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా షార్ట్ స్కర్ట్ లో స్టైలిష్ లుక్ తో అందాలు ఆరబోస్తూ ఫోటోలు షేర్ చేసింది. జీన్స్ టైప్ కోట్ ధరించిన ఈమె బీజ్ షార్ట్ నిక్కర్ తో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసుకుని.. లెదర్ తో డిజైన్ చేసిన హ్యాండ్ బ్యాగ్ ను చేతిలో పట్టుకొని స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిచ్చింది మాళవిక. చాలా రోజుల తర్వాత ఇలా బిల్డింగ్ పైకి ఎక్కి ఫోటోలకు ఫోజులు ఇవ్వడంతో అభిమానులు కూడా వీటికి ఫిదా అవుతున్నారు. ఈ ఫోటోలను షేర్ చేస్తూ అమ్మడిపై తమ అభిప్రాయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారు. మాళవిక ఎవరో కాదు మలయాళ స్టార్ సినిమాటోగ్రాఫర్ కే. యూ. మోహనన్ కుమార్తె. 1993 ఆగస్టు 4న జన్మించిన ఈమె మోడల్ గా తన కెరీర్ను ప్రారంభించింది. ఇక 2013లో వచ్చిన మలయాళ సినిమా పట్టం పోల్ ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టిన మాళవిక తమిళ్ , హిందీ భాషలలో నటిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది . ఈ ఏడాది ది రాజా సాబ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మాళవిక చెన్నై టైమ్స్ మోస్ట్ డిజైరబుల్ ఉమెన్ 2020 జాబితాలో ఐదవ స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. చివరిగా మలయాళంలో హృదయపూర్వం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన మాళవిక.. ఇప్పుడు సర్దార్ 2 సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే త్యాగరాజన్ కుమార రాజా తో కలిసి పాకెట్ నవల లో నటిస్తున్న ఈమె మరికొన్ని ప్రాజెక్టులలో భాగమైనట్లు సమాచారం. ఏది ఏమైనా ఇప్పుడు హీరోయిన్లు భాషతో సంబంధం లేకుండా పాన్ ఇండియా లెవెల్ లో అవకాశాలు అందుకుంటూ మరింత బిజీగా మారిపోయారు. మరి ఒకవేళ ఈ సినిమాలు గనుక మంచి విజయాన్ని అందుకుంటే మాళవిక స్టార్ హీరోయిన్గా ఎదుగుతుంది అనడంలో సందేహం లేదు.

# బోల్డ్ సీన్స్‌పై కియారా యూ టర్న్



కన్నడ స్టార్ యష్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ కలిసి నటిస్తున్న టాక్సిక్ సినిమా తాజాగా సోషల్ మీడియాలో భారీ చర్చకు దారి తీసింది. ముఖ్యంగా సినిమాలోని బోల్డ్ కంటెంట్, దాని చుట్టూ తిరుగుతున్న గాసిప్‌లు, మరియు హీరోయిన్ కెరీర్‌పై దీని ప్రభావం.. ఇవన్నీ కలిపి ఈ ప్రాజెక్ట్‌ను మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి. రీసెంట్ టైమ్స్ లో ఇండియన్ సినిమాల్లో బోల్డ్ కంటెంట్ పెరుగుతుందనేది స్పష్టమైన ట్రెండ్. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, గ్లోబల్ కంటెంట్ ఎక్స్‌పోజర్ కారణంగా డైరెక్టర్లు మరింత రియలిస్టిక్, ఎమోషనల్ మరియు బోల్డ్ ట్రీట్‌మెంట్ వైపు మళ్లుతున్నారు. అయితే ఈ విషయంలో ఆడియన్స్ యాక్సెప్టెన్స్ మాత్రం ఇంకా మిక్స్డ్ గానే కనిపిస్తోంది. అర్బన్ ఆడియన్స్ ఈ మార్పులను స్వాగతిస్తున్నా, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మాత్రం ఇంకా కొంత రిజర్వేషన్ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో టాక్సిక్ లాంటి బోల్డ్ యాక్షన్ డ్రామా ఎంతవరకు కనెక్ట్ అవుతుందో అనేది ఆసక్తికర ప్రశ్నగా మారింది. ఇదే సమయంలో, కియారా అద్వానీ కెరీర్ లో ఈ సినిమా కీలక మలుపుగా భావించవచ్చు. ఇప్పటి వరకు గ్లామరస్, రొమాంటిక్, కమర్షియల్ రోల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఈసారి మరింత బోల్డ్, ఇంటెన్స్ పాత్రను ఎంచుకోవడం ఒక రిస్కీ స్టెప్‌గా కనిపిస్తోంది. ఇది ఆమెను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశాన్ని కూడా విస్మరించలేం. ముఖ్యంగా సీన్ లెంగ్త్ లేదా ప్రెజెంటేషన్‌పై వచ్చిన తాజా గాసిప్‌లు, ఆమె కెరీర్ స్ట్రాటజీపై కొత్త చర్చలకు దారితీశాయి. ఈ సినిమాలో తాను నటించిన బోల్డ్ సీన్స్ ను ట్రిమ్ చేయాలని కృతి మేకర్స్ ను కోరినట్టు తెలుస్తోంది. షూటింగ్ టైమ్ లో ఈ సీన్స్ తన అనుమతితోనే జరిగినప్పటికీ, ఇప్పుడు ఫైనల్ అవుట్‌పుట్ చూశాక కృతికి ఇబ్బందిగా అనిపించి, తన డెసిషన్ ను మార్చుకున్నారని, అందుకే ఆ సీన్స్ ను సినిమాలో నుంచి తొలగించాలని డైరెక్టర్ ను సంప్రదించినట్టు తెలుస్తోంది. సాధారణంగా సినిమా షూట్ సమయంలో నటీనటులకు స్క్రిప్ట్, సీన్ బ్లాకింగ్, కెమెరా ట్రీట్‌మెంట్ గురించి ముందుగానే అవగాహన ఉంటుంది. ముఖ్యంగా బోల్డ్ లేదా ఇంటిమేట్ సీన్స్ విషయంలో డైరెక్టర్, నటీనటుల మధ్య క్లియర్ కమ్యూనికేషన్ ఉంటుంది. అయితే, ఫైనల్ ఎడిట్‌లో సీన్ ఎలా కనిపిస్తుందో, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కెమెరా యాంగిల్స్, ఎడిటింగ్ టెంపో, విజువల్ టోన్.. ఇవన్నీ కలిపి పూర్తిగా భిన్నంగా అనిపించే అవకాశముంది. ఈ కారణంగా కొన్ని సందర్భాల్లో నటీనటులు తమ కంఫర్ట్ జోన్‌ను మళ్లీ రీవాల్యుయేట్ చేయాలనుకుంటారు. ఇదేమీ కొత్త విషయం కాదు. అయితే ఒకసారి సీన్ షూటింగ్ అయిపోయాక, ఒప్పందం ప్రకారం ఫుటేజ్ ప్రొడక్షన్ హౌస్‌కు వెళ్ళిన తర్వాత, ఫైనల్ కట్‌పై పూర్తి నియంత్రణ దర్శకనిర్మాతలకే ఉంటుంది. అయితే, స్టార్ నటీనటులకు ఒక స్థాయిలో క్రియేటివ్ ఇన్‌పుట్ ఉండటం కూడా సాధారణమే. ముఖ్యంగా తమ ఇమేజ్, పబ్లిక్ పర్సెప్షన్‌కు సంబంధించిన అంశాల్లో వారు అభిప్రాయం చెప్పడం అసాధారణం కాదు. కానీ ఆ అభిప్రాయం ఎంతవరకు అమలు అవుతుందనేది పూర్తిగా మేకర్స్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. బాలీవుడ్ లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, కియారా షూట్ టైమ్ లో కంఫర్ట్‌గా ఫీల్ అయినా, ఫైనల్ అవుట్‌పుట్ చూసిన తర్వాత కొన్ని సీన్స్ ప్రెజెంటేషన్‌పై డౌట్స్ వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.కాగా, ఈ గాసిప్ మొత్తం సినిమాపై హైప్‌ను గణనీయంగా పెంచింది. నెగెటివ్ లేదా కాంట్రవర్సీ టోన్‌లో వచ్చినప్పటికీ, ఈ డిస్కషన్స్ ఆడియన్స్ లో ఆసక్తిని పెంచుతున్నాయి. అసలు ఆ ఇంటిమేట్ సీన్ ఎలా ఉంటుంది?, ఫైనల్ కట్‌లో మార్పులుంటాయా? అని నెటిజన్లు తెగ మాట్లాడుకుంటున్నారు. సాధారణంగా ఇలాంటి నెగెటివ్ పబ్లిసిటీ కూడా కొన్నిసార్లు సినిమాకు ప్లస్‌గా మారిన సందర్భాలున్నాయి. రిలీజ్‌కు ముందే ఇంతటి హైప్ తెచ్చుకున్న ఈ సినిమా, రిలీజ్ తర్వాత ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి. త్వరలోనే మేకర్స్ ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేసే వీలుంది.

### యువ ఇంజనీర్ల శిక్షణ బాధ్యతను

# పరిశ్రమలు స్వీకరించాలి

## : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్, మే 4 (ప్రజాకలం) :తెలంగాణాలో ఏటా చదువులు పూర్తి చేసుకుంటున్న 2 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణనిచ్చి, ఉద్యోగాలకు సంసిద్ధులను చేసే కర్తవ్యాన్ని పరిశ్రమలు స్వీకరించాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. యూనివర్సిటీ చదువులకు, ఇండస్ట్రీ అవసరాలకు అంతరం పెరిగినందున ప్రతి సంస్థ తమ బాధ్యతగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని శ్రీధర్ బాబు సూచించారు. నగరానికి చెందిన పిఎస్ ఆర్ టెక్ హబ్ సంస్థ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నాడు బేగంపేట లోని వివాంతా హోటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. టెక్నాలజి రంగంలో నిత్యం ఎదురయ్యే పెను సవాళ్లను అధిగమించి పదేళ్లలో రూ.120 కోట్ల సంస్థగా నిలదొక్కుకునేలా చేయడం పట్ల పిఎస్ టెక్ హబ్ అధినేత పి. శ్రీరంగారావును శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. కరోనా సమయంలో ఎన్నో సంస్థలు మూతపడటమో, నష్టాలకు గురికావడమో జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. టెక్నాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక ఆవిష్కరణలు, ఏఐ లాంటి సవాళ్లను ఎదుర్కొని 250 మంది ఉద్యోగులకు భరోసానివ్వడం సాధారణ విషయం కాదని శ్రీధర్ బాబు కొనియాడారు. వేగంగా విస్తరిస్తున్న ఏఐ ప్రభావాన్ని ఎదుర్కొనేలా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్ల నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు. 'ఏఐ హబ్' పేరుతో ప్రత్యేక శిక్షణ సంస్థను ఏర్పాటు చేసి వచ్చే రెండు నెలల్లో రీస్కిల్లింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు.

భారీ విస్తరణకు ప్రణాళికలు: పిఎస్ ఆర్ టెక్ హబ్ దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తోందని డైరెక్టర్ పి. నమ్యుత తెలిపారు. వచ్చే మూడేళ్లలో దేశం వెలుపల కార్యాలయాలను విస్తరించి ఉద్యోగుల సంఖ్యను 1,000 కి పెంచుతామని వివరించారు. మంత్రి సూచన మేరకు చదువులు పూర్తయిన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణనిచ్చి, ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, క్లయింట్లు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



## పట్టపగలు తుపాకులతో తిరుగుతుంటే పోలీస్ యంత్రాంగం ఏం చేస్తుంది : కేటీఆర్

హైదరాబాద్, మే 4 (ప్రజాకలం) : పోలీసుల వాహనాల్లో డీజిల్ లేక ఆ వాహనాలను తోసుకుంటూ వెళ్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. కరీంనగర్ జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీలో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఐదుగురు దుండగుల ముఠా దోపిడీకి పాల్పడిన ఘటనలో గాయపడ్డ వారు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. కేటీఆర్ బీఆర్ఎస్ నేతలతో కలిసి పరామర్శించారు.

అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కరీంనగర్‌లో పట్టపగలు ఐదుగురు దుండగులు తుపాకులతో తిరుగుతుంటే పోలీస్ యంత్రాంగం ఏం చేస్తుందని ప్రశ్నించారు. మా కార్పొరేటర్లపై కేసులు, సోషల్ మీడియాలో మా పిల్లలు ఏదైనా పోస్టులు పెడితే ఫోన్ చేసి బెదిరించడం, ఒక రీట్వీట్ కొడితే 20 రోజులు జైల్లో పెట్టడం ఇదేనా పోలీసింగ్ అంటే.. ? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

రేవంత్ రెడ్డి అసమర్థత వల్ల శాంతిభద్రతల్లో తెలంగాణ ఈ రోజు బీహార్ స్థితితో పోటీ పడుతుందన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ పంట సాగులో పంజాబ్, హర్యానా రాష్ట్రాలను దాటి మొదటి స్థానంలో నిలిచింది. కానీ ఈ రోజు రేవంత్ రెడ్డి హయాంలో తెలంగాణలో బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకంటే దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. కరీంనగర్ పట్టణంలో ఉదయం 11 గంటలకు తుపాకులతో చొరబడి జ్యువెలరీ షాపులో దొంగతనం చేశారు. ఈ ఘటన జరిగి ఇన్ని గంటలు గడుస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు.

### బీజేపీ మిషన్ బెంగాల్.. పెరిగిన సీట్లు, ఓట్లు.. కలిసొచ్చిన అంశాలివి

ఈసారి ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్నే. మిషన్ బెంగాల్ అంటూ అధికారం చేపట్టడమే లక్ష్యంగా బీజేపీ పని చేసింది. టీఎంసీకి, మమతా బెనర్జీకి కంచుకోటగా ఉన్న బెంగాల్‌లో భారీ విజయం దిశగా బీజేపీ దూసుకుపోతోంది. 294 సీట్లున్న బెంగాల్‌లో బీజేపీ 192 సీట్లలో ఆధిక్యంలో ఉంది. టీఎంసీ దాదాపు 96 సీట్లలో ఆధిక్యంలో కొనసాగుతోంది. ప్రస్తత రిజల్ట్ ట్రెండ్ ప్రకారం బెంగాల్‌లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయం. 15 ఏళ్ల మమత సామ్రాజ్యం కూలడం కూడా ఖాయం. అయితే, 15 ఏళ్లుగా అధికారంలో ఉండి బెంగాల్‌ను ఒంటిచేత్తో శాసించిన మమతను ఓడించడానికి బీజేపీ ప్రత్యేక మిషన్ కొనసాగించింది. దాని ఫలితమే నేటి విజయం. బీజేపీకి బెంగాల్‌లోని ఉత్తర ప్రాంతంలో ఎప్పట్నుంచో మంచి పట్టు ఉంది. అయితే, ఈసారి దక్షిణ ప్రాంతంలో కూడా బీజేపీ అధిక స్థానాల్లో విజయం సాధిస్తోంది. అది కూడా టీఎంసీకి పట్టున్న ప్రాంతాల్లో ఆ పార్టీని ఓడిస్తోంది. ఇక బెంగాల్‌లో కీలక పట్టణాలైన కోల్‌కతా, హౌరా, హుగ్లీ జిల్లాల్లో కూడా బీజేపీ సీట్లు గెలుచుకుంటోంది. 2021లో బెంగాల్‌లో బీజేపీ 77 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇప్పుడు మాత్రం ఆ సీట్లకు అదనంగా ఇంకో 120 సీట్ల వరకు పొందే ఛాన్స్ ఉంది. అంటే ఏ స్థాయిలో బీజేపీ పుంజుకుందో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వం వల్లే సాధ్యమైందని, వారి ప్రచారం బాగా కలిసొచ్చిందని బీజేపీ శ్రేణులు అంటున్నాయి. ఈసారి బీజేపీకి ఓట్ల శాతం కూడా పెరిగింది. తాజా ట్రెండ్ ప్రకారం బీజేపీకి 45 శాతం ఓట్లు పోలవ్వగా, టీఎంసీకి 40 శాతం ఓట్లు పోలయ్యాయి. 2021లో టీఎంసీకి 28,968,281 ఓట్లురాగా, బీజేపీకి 22,905,474 ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల మధ్య ఓట్ల వ్యత్యాసం దాదాపు 60 లక్షలు. అప్పట్లో టీఎంసీకి 48 శాతం ఓట్లు రాగా, బీజేపీకి 38 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీకి పార్టీపరంగానే కాకుండా, సిద్ధాంత పరంగా కూడా బెంగాల్‌లో సానుకూల ఫలితాలు వస్తున్నాయి. ఇదంతా బీజేపీ ఎన్నికల ఇంఛార్జి భూపేందర్ యాదవ్, విప్లవ్ కుమార్ దేవ్, రాష్ట్ర బీజేపీ చీఫ్ శామిక్ భట్టాచార్య వల్లే సాధ్యమైందన్నది పార్టీ వర్గాల మాట.

# బెంగాల్‌లో చారిత్రక తీర్పు

## విజయోత్సవ సంబరాల్లో మోదీ

న్యూఢిల్లీ: బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అసాధారణమైన, చారిత్రక తీర్పునిచ్చారని, ఆ ఆనందం కార్యకర్తల కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్‌లో నూతన చరిత్రను ఆవిష్కరించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మార్గదర్శకంలో జరిగిన తొలి ఎన్నికలు ఇవంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకూ ప్రతిచోట కమలం వికసించిందని, కామాక్ష అమ్మవారి ఆశీర్వచనం పుష్కలంగా లభించిందని చెప్పారు. పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విజయోత్సవ సంబరాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. బెంగాలీ ధోతితో విచ్చేసిన ప్రధానికి పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. 'మోదీ మోదీ' నినాదాలతో కార్తకర్తలు హోరెత్తించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బెంగాల్ బీజేపీ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఉపశమనం కలిగిందన్నారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన



కలలుగన్నారని, అది ఇన్నేళ్ల తర్వాత వాస్తవరూపం దాల్చిందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇచ్చారని చెప్పారు. బెంగాల్‌లో మార్పుకోరుతూ పవనాలు బలంగా వీచాయని పేర్కొన్నారు. బీజేపీ అంటేనే సుపరిపాలన అనే విషయం ప్రజలకు బాగా తెలుసునని ప్రశంసించారు. అస్సాంలో బీజేపీ-ఎన్డీయేను ప్రజలు మరోసారి ఆశీర్వదించారని, అభివృద్ధికి ప్రజలు బాసటగా నిలిచారని ప్రధాని కొనియాడారు. తిరుగులేని తీర్పునిచ్చిన అస్సాం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వోతోముఖాభివృద్ధికి భరోసాగా ఉంటామన్నారు. దశాబ్దాలుగా పార్టీ, కూటమి ఎదుగుదలకు అవిశ్రాంతంగా కృషి చేసిన బీజేపీ-ఎన్డీయే కార్యకర్తలను అభినందించారు.

థాంక్యూ పుదుచ్చేరి

ముఖ్యమంత్రి ఎన్.రామస్వామి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం టాక్ రికార్డు, సుపరిపాలనకు మరోసారి పట్టం కట్టిన పుదుచ్చేరి ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తలకు అభినందనలు చెప్పారు.

యూడీఎఫ్‌కు అభినందనలు

కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్‌కు ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. బీజేపీ-ఎన్డీయేకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కేరళ ప్రగతి కోసం, వికసిత కేరళం విజన్ సాకారం కోసం తాము పనిచేస్తామని చెప్పారు. కేరళం ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు తమ సపోర్ట్ ఎప్పటికీ ఉంటుందన్నారు.

టీవీకేకు సైతం...

తమిళనాడులో మంచి ఫలితాలు సాధించిన విజయ్ టీవీకేను ప్రధాని అభినందించారు. ఎన్డీయేకు మద్దతుగా ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యలు, వారి జీవనప్రమాణాల మెరుగుదలకు తాము ఎప్పుడూ ముందుంటామని చెప్పారు. తమిళనాడు ప్రగతి, ప్రజాక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు.

# పెట్రో భారం తప్పదా?



ముంబై : మొన్ననే కదా కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి విలేకర్ల ముందుకు వచ్చి.. ఎట్టి పరిస్థితుల్లో ఇండియాలో ధరలు పెంచేది లేదు అని చెప్పింది.. ఆమె అలా చెప్పిందో లేదో.. ఇప్పుడు జాతీయ మీడియాలో వార్తలు వచ్చేస్తున్నాయి. వాటి సారాంశం ఏంటంటే.. దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయట. పెట్రోల్ మీద, డీజిల్ మీద లీటర్ కు నాలుగు నుంచి ఐదు రూపాయలు పెరిగే అవకాశం ఉందని ఇండియా టుడే లో ఒక వార్త కథనం ప్రసారం అయింది. ఇవి మాత్రమే కాదు ఇంట్లో వాడే గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా 50 రూపాయల వరకు పెరిగే అవకాశం ఉందట. త్వరలో దీనిపై కేంద్రం ఒక కీలకపాటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇప్పటికే కమర్షియల్ గ్యాస్, 5 కిలోల ఎల్పీజీ సిలిండర్లు, జెట్ ఫ్యూయల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ధరల భారం తప్పదని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే విమర్శలు మొదలుపెట్టింది. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టుగానే కేంద్రం ధరలు పెంచుతోందని ఇండియా టుడే లో ఓ వార్త కథనం ప్రసారమైంది. ఇప్పటికే మధ్య ఆసియాలో యుద్ధం వల్ల దేశ అవసరాలకు సరిపడా క్రూడ్ ఆయిల్ రావడం లేదు. క్రూడ్ ఆయిల్ రవాణా కోసం అనేక రకాలుగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో చమురు సరఫరా విషయంలో కంపెనీలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర ఏకంగా 110 డాలర్లను మించిపోయింది. ఫలితంగా దేశీయ ఆయిల్ కంపెనీలకు విపరీతంగా నష్టం వస్తోంది. అందువల్లే ధరల పెంపు అనివార్యమని ఇండియా టుడే తన కథనంలో స్పష్టం చేసింది. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగితే ఆ ప్రభావం అన్ని వాటి మీద ఉంటుంది. ఇప్పటికీ కమర్షియల్ గ్యాస్ ధర విపరీతంగా పెరిగింది. పెట్రోల్ ఆధారిత ఉత్పత్తుల ధర కూడా విపరీతంగా పెరిగింది. దీంతో ధరల స్థాయి మరింత పెరిగింది. ఫలితంగా సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ధరల స్థాయి ఇదే విధంగా ఉంటే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉంది. ఇటీవల నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరిగాయి కాబట్టి కేంద్రం ధరలు పెంచలేదు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా ప్రస్తావించింది.

### ఇరాన్ సెగతో అమెరికాకు

# కాసుల పంట



### - భారీ ఆయుధ ఒప్పందాల వెల్లువ!

వాషింగ్టన్: అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ నీతి ఎప్పుడూ చర్చనీయాంశమే. ఒకవైపు ఆ యుద్ధాన్ని నేనే ఆపాను.. ఈ యుద్ధాన్ని నేనే ఆపాను అని ప్రపంచం నమ్మని గొప్పలు చెప్పుకుంటూనే యుద్ధాలను నివారించే పెద్దన్నగా కనిపిస్తూనే, మరోవైపు యుద్ధ భయాన్ని సృష్టించి తన ఆయుధ వ్యాపారాన్ని పెంచుకుంటోందన్న విమర్శలు ఇప్పుడు ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బలపడుతున్నాయి. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను అమెరికా తన ఆర్థిక లాభం కోసం వాడుకుంటోందనే ఆరోపణలు ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. ఇరాన్‌ను యుద్ధంలోకి దింపడం ద్వారా దాని పొరుగున ఉన్న ఇస్లాం దేశాల్లో అభద్రతా భావాన్ని సృష్టించి, ఆ దేశాలకు భారీగా ఆయుధాలను విక్రయించడమే అమెరికా అసలు అజెండా అని విశ్లేషకులు భావిస్తున్నారు. శాంతి చర్చల పేరుతో ఇరాన్ యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చి, ఈ విరామ సమయంలో తన వెపన్ మార్కెట్‌ను అగ్రరాజ్యం విస్తరిస్తోందని చెప్పేందుకు భారీ డీల్ ఉపయోగపడుతుంది. ఇరాన్ తమపై దాడి చేయవచ్చనే భయంతో ఉన్న నాలుగు దేశాలకు అమెరికా భారీ ఎత్తున యుద్ధ సామగ్రిని విక్రయించేందుకు సిద్ధమైంది. మొత్తం వి9 బిలియన్ల (దాదాపు రూ. 85,000 కోట్లు) విలువైన ఆయుధాల విక్రయానికి ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్, కువైట్, ఖతర్, మరియు యూఏఈకి ఈ ఆయుధాలను సరఫరా చేయనున్నారు. ఇరాన్ నుంచి ఎదురయ్యే ముప్పును ఎదుర్కొనేందుకు ఈ దేశాలకు అత్యాధునిక వెపన్స్ అవసరమని అమెరికా ఈ డీల్ సమర్థించుకుంటోంది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఈ ఒప్పందంపై అత్యంత వేగంగా స్పందించారు. ఆర్డర్ ప్లేస్ చేసిన దేశాలకు ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే ఆయుధాలను పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఉద్రిక్తతలు ఉన్నప్పుడే డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, ఈ లోపు ఆయుధాల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అగ్రరాజ్యం భావిస్తోంది. అమెరికా విదేశాంగ విధానంపై అంతర్జాతీయ నిపుణులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఇరాన్ సమీప ఇస్లాం దేశాలపై దాడి చేసే అవకాశం ఉందంటూ కృత్రిమంగా యుద్ధ భయాన్ని సృష్టించి, తన వెపన్ మార్కెట్‌ను పెంచుకోవడమే అమెరికా ప్రధాన అజెండా అని విమర్శకులు మండిపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ గొడవలు జరిగినా, అక్కడ అమెరికా ఆయుధాలు ప్రత్యక్షమవ్వడం వెనుక పెద్ద ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని వాదిస్తున్నారు. ఒకవైపు ఇరాన్ అణు కార్యక్రమాలపై ఆంక్షలు విధిస్తూ, మరోవైపు ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణాన్ని వేడెక్కించడం ద్వారా అమెరికా తన ఖజానాను నింపుకుంటోంది. ఈ క్రమంలో రూ. 85 వేల కోట్ల విలువైన ఆయుధ ఒప్పందం పశ్చిమాసియాలో ఆయుధ పోటీని మరింత పెంచే ప్రమాదం ఉంది. మార్చుకోవడం ప్రపంచ భద్రతకు పెను ముప్పుగా పరిణమించవచ్చు.

# ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో కూడ ప్రజావాణి నిర్వహణ: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం.



సంగారెడ్డి ప్రతినిధి, మే 04:,( ప్రజా కలం): జిల్లాలో నేటి నుండి ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఆయా డివిజన్ పరిధిలోని ప్రజలు తమ డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలను ఆయా వివరాలు అడిగి తెలుసుకుని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజావాణితో పాటు ఆందోల్, సంగారెడ్డి డివిజన్లకు సంబంధించిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్ కేంద్రాలలోని సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యాలయాలలో ప్రతి సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుపుతుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ప్రజలు తమ డివిజన్ కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి హాజరై తమ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. అలాగే, డివిజనల్ స్థాయి అధికారులందరూ తమ తమ డివిజన్లలో తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరై, అందిన ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేసిన తర్వాత 30 రోజులలోపు పరిష్కరించాలని, ఏవైనా కారణాల వల్ల ఆలస్యం అయితే వాటిని స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో డివిజన్ వారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపె మొత్తం(134) ఫిర్యాదులు అందాయని, అందులో కలెక్టరేట్ కు 57 ఫిర్యాదులు , సంగారెడ్డి డివిజన్ కు 29, ఆందోల్ కు 02, నారాయణఖేడ్ కు 24, జహీరాబాద్ ప్రజావాణికి 22 ఫిర్యాదులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా అధికారులు, సంగారెడ్డి, ఆందోల్ డివిజన్ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, మే 04,(ప్రజా కలం)

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (89) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ-- 24, ఇతర శాఖలు -- 65, మొత్తం 89 దరఖాస్తులు అందాయి.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ నుండి ప్రారంభమైన రైతు వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని వివరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అదే విధంగా జనాభా గణన-2027 కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణనలో పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయగణన ఆన్ లైన్ పోర్టల్ (ంవ.షవఅంబం.స్త్రశీజ.ఱఅ) వెబ్ సైట్ ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి ప్రారంభమయిన ఈ స్వీయగణన కార్యక్రమం మే 10 వరకు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ స్వీయ గణన ఆన్ లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేయాలని అన్నారు. స్వీయ గణన లో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినపుడు మీ ఐడి వివరాలు తెలియపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, మే 04,(ప్రజా కలం)

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (89) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ-- 24, ఇతర శాఖలు -- 65, మొత్తం 89 దరఖాస్తులు అందాయి.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ నుండి ప్రారంభమైన రైతు వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని వివరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా జనాభా గణన-2027 కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి ఒక్కరు స్వీయ గణనలో పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయగణన ఆన్ లైన్ పోర్టల్ (ంవ.షవఅంబం.స్త్రశీజ.ఱఅ) వెబ్ సైట్ ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి ప్రారంభమయిన ఈ స్వీయగణన కార్యక్రమం మే 10 వరకు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ స్వీయ గణన ఆన్ లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేయాలని అన్నారు. స్వీయ గణన లో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినపుడు మీ ఐడి వివరాలు తెలియపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో కూడ ప్రజావాణి నిర్వహణ: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం.





సంగారెడ్డి ప్రతినిధి, మే 04:,( ప్రజా కలం): జిల్లాలో నేటి నుండి ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఆయా డివిజన్ పరిధిలోని ప్రజలు తమ డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలను ఆయా వివరాలు అడిగి తెలుసుకుని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజావాణితో పాటు ఆందోల్, సంగారెడ్డి డివిజన్లకు సంబంధించిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్ కేంద్రాలలోని సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యాలయాలలో ప్రతి సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుపుతుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ప్రజలు తమ డివిజన్ కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి హాజరై తమ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. అలాగే, డివిజనల్ స్థాయి అధికారులందరూ తమ తమ డివిజన్లలో తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరై, అందిన ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేసిన తర్వాత 30 రోజులలోపు పరిష్కరించాలని, ఏవైనా కారణాల వల్ల ఆలస్యం అయితే వాటిని స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో డివిజన్ వారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై మొత్తం(134) ఫిర్యాదులు అందాయని, అందులో కలెక్టరేట్ కు 57 ఫిర్యాదులు , సంగారెడ్డి డివిజన్ కు 29, ఆందోల్ కు 02, నారాయణఖేడ్ కు 24, జహీరాబాద్ ప్రజావాణికి 22 ఫిర్యాదులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా అధికారులు, సంగారెడ్డి, ఆందోల్ డివిజన్ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను

# సమర్ధవంతంగా నిర్వహించాలి

## - రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ 04,(ప్రజా కలం)

2025-26 యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్రహౌహౌసమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడా యువజన సేవల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో రక్షణ చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రదేశాలలో ఉండేలా చూడడంతో పాటు గాలి తీవ్రతకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, తేమ, ప్యాడి క్లీనర్ యంత్రాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వాతావరణ శాఖ అధికారులు వర్ష సూచనలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేసి అప్రమత్తమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించాలని, ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియలలో జాప్యం జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ధాన్యం తరలింపులో హమాలీలు, వాహనాల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, గ్రామస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు తను పరిధిలోని ప్రతి కొనుగోలు కేంద్రాన్ని పర్యవేక్షించాలని, మే మాసాంతానికి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా సహకార అధికారి సుధాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాగుగడ్డ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ స్వాముల పూజలు

## హనుమాన్ మాలధారణ శ్రేష్టం - ప్రతాప్ రెడ్డి

## కొనసాగుతున్న మహా అన్నప్రసాద కార్యక్రమం





గజ్వేల్:04 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ వాగుగడ్డ హనుమాన్ ఆలయంలో హనుమాన్ స్వాములు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్,జయసింహారావు మాట్లాడుతూ హనుమాన్ స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని కోరుకుంటూ,హనుమాన్ మాలధారణ శ్రేష్టమని,వాగుగడ్డ హనుమాన్ దేవాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం దాతల సహకారంతో హనుమాన్ మాల ధారణ స్వాములకు అన్నప్రసాదం అందజేయడం జరుగుతుందని, ప్రతి శ్రీరామనవమి నుండి హనుమాన్ జయంతి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని యువత దైవభక్తి సేవా భావం కలిగి ఉండాలని దైవనామస్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని హనుమాన్ మాలధారణ వల్ల, కోరిన కోరికలు నెరవేరుతాయి అని అన్నారు

# జాలిగామ చెరువు కట్టపై పిచ్చి చెట్లను తొలగించాలి - రైతుల విజ్ఞప్తి

## కట్ట వెంబడి పెరిగిన సర్కార్ తుమ్మలు కోతులకు ఆవాసాలుగా మారాయి



గజ్వేల్ :04 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో సోమవారం గ్రామ రైతులు గ్రామంలోని నల్లచెరువు కట్టపై పిచ్చి చెట్లు సర్కార్ తుమ్మలు విపరీతంగా పెరిగి కట్టపై రహదారి లేకుండా చేస్తున్నాయని,తమ పంట పొలాల్లోకి వెళ్ళడానికి ఇబ్బందిగా మారిందని,ఏపుగా పెరిగిన చెట్లలో కోతులు మకాం వేశాయని,ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బిక్షపతి ముదిరాజ్,కురుమ నర్సింలు,స్వామి మాట్లాడుతూ చెరువు కట్టపై పిచ్చి చెట్లు సర్కార్ తుమ్మ చెట్లు తొలగించాలని ఇటీవల గ్రామ సర్పంచ్ కు వినతిపత్రం అందజేయగా,చెట్లను తొలగించే ప్రయత్నం చేశారు కానీ ఒక్కరోజు ముళ్ళ పొదలను తొలగించే క్రమంలో గ్రామంలోని బిఆర్ఎస్ నాయకులు అడ్డుకొని పనిని ఆపడం జరిగిందని,వెంటనే అధికారులు సర్కార్ తుమ్మలను తొలగించి మాకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్ తాళ్ళ సునీత ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని రైతుల విజ్ఞప్తి మేరకు చెరువు కట్టపై సర్కార్ తుమ్మలను తొలగించడం జరిగిందని మంచి పనిని అడ్డుకోవడం భావ్యం కాదని గ్రామ అభివృద్ధి కోసం సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు

# గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై అవగాహన సమావేశం.



సిద్దిపేట ప్రజాకలం మే 04.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని కొనయిపల్లి గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, 3 నుండి 6 సంవత్సరాల పిల్లలు మరియు 7 నెలల నుండి 3 సంవత్సరాల చిన్నారుల కోసం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీహెచ్ఆర్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని తల్లి-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, శుభ్రత వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నిజామాబాద్ జిల్లా లో బీసీ,ఎస్సీ,ఎస్టీ-జేఏసి బహిరంగ సభ జయప్రదం చేయండి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 04:

నేడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సామాజిక న్యాయం రాజ్యాధికారం కై ఎవరి కులం ఎంతో వారికంత వాటా... నిజామాబాద్ జిల్లాలో పాత కలెక్టర్ గ్రౌండ్ లో సాయంత్రం 5:00 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీసీ,ఎస్సీ, ఎస్టీ-జేఏసీ జిల్లా కన్వీనర్ రామా గౌడ్ ప్రకటనలో తెలియజేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీసీ,ఎస్సీ ఎస్టీ-జేఏసి చైర్మన్ డా.విశారదన్ మహారాజ్ ,జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజ్ హాజరుకానున్నారు.. జిల్లాలో నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు సభకి తరలి రావాలని పిలుపునిచ్చారు..



## ప్రజావాణికి 103 ఫిర్యాదులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 04:

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల



సముదాయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావని కార్యక్రమం లో 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పిటిషనర్లు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డిఆర్‌డిఎ సాయన్న, జెడ్పి సిఇఒ సాయగౌడ్ మరియు డిపిఒ శ్రీనివాస్‌లకు వినతిపత్రాలను సమర్పించారు. అంతేకాకుండా, పిటిషన్లను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, సబ్-కలెక్టర్, ఆర్డీఓల నాయకత్వంలో డివిజన్ స్థాయిలో జరిగే ప్రజావణి కార్యక్రమంలో సంబంధిత డివిజన్‌లోని తహసీల్దార్లు పాల్గొనాలని ఆయన సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 17 వ రోజుకు చేరుకున్న ఫ్యాబ్ సిటీ భూ నిర్వాసిత రైతుల రిలే దీక్షలు

మహేశ్వరం, మే 04,(ప్రజా కలం)

వివాదాలు లేని స్థలంలో తమకు ప్లాట్లు కేటాయించాలని చేపట్టిన ఫ్యాబ్ సిటీ రైతుల రిలే నిరాహార దీక్షలు 17వ రోజుకు చేరుకున్నాయి ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు గతంలో



కేటాయించిన స్థలం కోర్టు వివాదాల్లో ఉన్నందున తమకు కోర్టు వివాదాలు లేని ప్రత్యామ్నాయ స్థలంలో ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని రిలే దీక్షలు చేపట్టామని రైతులు తెలియజేశారు 17 రోజులు గడుస్తున్నా టి జి ఐ ఐ సి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇంకా స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇదే తీరుతో వ్యవహరిస్తే రానున్న రోజులో ఉద్యమం తీవ్రమవుతుందని రైతులు హెచ్చరించారు.

## కేరళంలో కాంగ్రెస్ కూటమి విజయంపై కె ఎల్ ఆర్ హర్షం

మహేశ్వరం, మే 04, (ప్రజా కలం)

కేరళంలో యూడిఎఫ్ కూటమి విజయం సాధించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని భారీ ఆధిక్యం సాధించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యనాయకుల ప్రచారం కలిసి వచ్చిందని కె ఎల్ ఆర్ అన్నారు. అగ్రనేత రాహూల్ గాంధీ ని కేరళం ప్రజలు నమ్మారని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే కేరళంలో పలు సంక్షేమ పథకాలను యూడిఎఫ్ ప్రభుత్వంలో అమలు చేసేందుకు కేంద్ర నాయకత్వం తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఘన విజయానిచ్చిన కాంగ్రెస్ శ్రేణులకు లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.పేదలకు గృహకల్పన ధ్యేయమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం కందుకూరు మండల కేంద్రంలో లమూర్ గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.






## బ్యాంకులు,నగల దుకాణాల్లో భద్రతను కట్టుదిట్టం చేసుకోవాలి

### -సీపీ సాయిచైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 04:

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బ్యాంకులు, నగల దుకాణాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, జ్యువెలరీ వ్యాపారస్థులు, బంగారు వెండి వర్తక సంఘాల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి: జిల్లాకు 44వ జాతీయ రహదారి దగ్గరగా ఉ ఒడడం.. మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీపీ సూచించారు. నేరస్థులు జిల్లాలోకి ప్రవేశించి తొందరగా బయటపడే ఆస్కారం ఉన్నందున వ్యాపార సంస్థలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు, అలారం, సెక్యూరిటీ గార్డుల వ్యవస్థను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే :ఆయా వ్యాపార సంస్థల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, రాత్రి వేళల్లో కట్టుదిట్టమైన సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ బాస్ సూచించారు. నగదు, బంగారం రవాణా సమయంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాసరాజ్, వన్ టౌన్ ఎస్హెచ్వో రఘుపతి, నిజమాబాద్ రూరల్ సీఐ సతీష్ కుమార్, సీసీఆర్బీ సీఐ అంజయ్య, లీడ్బ్యాక్ మేనేజర్ సునీల్కుమార్, నిజామాబాద్ గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంత్, గోల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండీ యూసుఫ్ పాల్గొన్నారు.

## రైతులకు వరంగా ఉచిత మట్టి పరీక్షలు గోనుగోప్పుల రైతు వేదికలో అవగాహన కార్యక్రమం




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 04:

వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో డా. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి పరీక్షల కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ పట్టణ పరిధిలోని గోన్ గొప్పుల గ్రామ రైతు వేదికలో సోమవారం స్థానిక రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ, రైతులు తమ పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు సమర్పించాలని సూచించారు. ఈ పరీక్షల ద్వారా మట్టిలోని ముఖ్య పోషకాలైన నత్రజని (చీ), ఫాస్ఫరస్ (గ్రా), పొటాషియం (ఖ)తో పాటు సూక్ష్మ పోషకాల స్థాయిలను శాస్త్రీయంగా విశ్లేషించి, పంటలకు తగిన ఎరువుల వినియోగంపై మార్గదర్శకాలు అందిస్తారని తెలిపారు. అధిక ఎరువుల వినియోగం వల్ల మట్టిసారం తగ్గుతున్న నేపథ్యంలో, సరైన మట్టి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు దిగుబడులను పెంచుకోవచ్చని నిపుణులు వివరించారు.

అలాగే భూమికి అనుకూలమైన పంటల ఎంపిక, భూమి సంరక్షణకు అవసరమైన సూచనలు కూడా రైతులకు అందించబడతాయని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భూమి సారాన్ని పెంచుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాల కోసం కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నక్క హరీష్‌ను సంప్రదించవచ్చు. మొబైల్: 8008768238

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలి

**- రైతుల ఖాతాలో సకాలంలో డబ్బులు జమ చేయాలి.**
**- అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి.**
**- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి.**
**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**




సంగారెడ్డి, ప్రతినిధి మే 04 ( ప్రజా కలం): వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు కొనుగోలు కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ సమగ్ర పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్ మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, అకాల వర్షాల ప్రభావం నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతుల ఖాతాల్లో సకాలంలో చెల్లింపులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా శాఖల అధికారులు కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శించి పరిస్థితులను సమీక్షిస్తూ నివేదికలు సమర్పించాలని తెలిపారు.

3 రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేసి, వారికి సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించి, ధాన్యం రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సరైన ప్రణాళికతో కొనుగోలు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, డి.ఆర్.డి.ఓ, డి.సి.ఓ మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కాషాయ జెండా ఎగురుతుంది - కంచి మహేందర్

కూకట్ పల్లి, మే 04, ప్రజా కలం ప్రతినిధి;

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయాన్ని చారిత్రాత్మక మలుపుగా అభివర్ణిస్తూ, కాషాయం జెండా హైదరాబాద్‌లోనూ ఎగురుతుందని బిజెపి సీనియర్ నాయకుడు కంచి మహేందర్ ధీమా చేశారు. “బెంగాల్‌లో సాధించిన విజయంతో దేశ రాజకీయ దిశ మారిందని, అదే జోష్‌తో ఇప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికలని అన్నారు. ఫతేనగర్ డివిజన్‌లో ఆయన ఆధ్వర్యంలో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకుని క్రాకర్స్ కాల్చుతూ, ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బానీష్, రమేష్, గుప్తా, ఉష, దినేష్, చింటూ, మహాలక్ష్మి, గోపాల్, దశరత్ తదితరులు పాల్గొన్నారు.





## కేటీఆర్ సమక్షంలో గుబ్బల లక్ష్మీనారాయణ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 130 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలె శ్రీకాంత్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మి నారాయణ పుట్టినరోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద గౌడ్, ఎంఎల్ సి శంభీపూర్ రాజు సమక్షంలో దీ=వా వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్బంగా కేటిఆర్ శాలువా కప్పి గుబ్బల లక్ష్మి నారాయణ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సోమేశ్ యాదవ్, వేణు యాదవ్, మక్సుద్ భాయ్, కోలా శ్రీకాంత్ మరియు సీనియర్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలతో ప్రత్యక్షంగా ముఖాముఖి జిల్లా ఎస్పీ.

**-ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం,**
**-ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు విన్న జిల్లా ఎస్పీ**
**-ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్.హెచ్.ఓలకు ఆదేశాలు -: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,**



సంగారెడ్డి ప్రతినిధి: మే 04 : ( ప్రజా కలం): ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, సంబంధిత అంశాలపై ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలి.

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం మే 04.

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని



జిల్లా కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణికి వచ్చి వినతులు అందజేస్తున్నారని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 69 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ఆర్డీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు.



# పేదలకు గృహకల్పన ధ్యేయమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

## కందుకూరు మండల కేంద్రంలో లమూర్ గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్న మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, మే 04,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం లేమూర్ గ్రామానికి చెందిన గంగరి సోని శ్రీనివాస్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమానికి గ్రామ శాఖ అధ్యక్షులు మహమ్మద్ రహీమ్ మాజీ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఢిల్లీ శ్రీధర్ లమూర్ గ్రామ ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ మూల ఇంద్రారెడ్డి, మంచాల భాస్కర్,గుల్వి దేవేందర్ తదితరులు హాజరు కావడం జరిగింది. గ్రామం లో గృహప్రవేశం చేసిన దంపతులకు మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి సహకారం తో నూతన వస్త్రాములు వారికి బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కల ప్రజా పాలనలో సీఎం తో సాధ్యమైందని అన్నారు. నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ఇందిరమ్మ రాజ్యం ఏర్పడింది. ఈ కార్యక్రమం లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల రాజేష్ బూత్ కమిటీ మెంబర్ ఎండీ అఖిల్ అహ్మద్,ఎస్సి సెల్ అధ్యక్షులు డప్పు పోచయ్య, గుర్రం సత్తయ్య చిన్నగాళ్ల రాజభూషణం, జంగిలి బన్నీ, గంగరి యాదయ్య, సురేష్ లక్ష్మయ్య, రవీందర్,మంచాల లక్ష్మయ్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రజా క్షేత్రంలోకి 'కొత్త స్వరం

## పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితమ్మను కలిసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి



మహేశ్వరం, మే 04,(ప్రజా కలం)

ఈనెల 8న రంగారెడ్డి–పాలమూరు ఎత్తిపోతల పథకంపై భారీ ఆందోళనకు పిలుపు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధినేత్రి కవితమ్మ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మరియు ప్రజా సమస్యలపై చర్చించారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీని గ్రామ స్థాయి నుండి పటిష్టం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను పాండురంగా రెడ్డి అధినేత్రికి వివరించారు. "కొత్త తరం కోసం కొత్త స్వరం" అనే నినాదంతో యువతను, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆశయాలను ఇంటింటికీ తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారు పునరుద్ఘాటించారు. జిల్లా ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తి లేదని పాండురంగా రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా, రంగారెడ్డి – పాలమూరు ఎత్తిపోతల పథకం విషయంలో జరుగుతున్న జాప్యంపై, రైతాంగ ప్రయోజనాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ ఈనెల 8వ తేదీన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని అధినేత్రి కవితమ్మ దిశానిర్దేశం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమా నికి జిల్లాలోని పార్టీ శ్రేణులు, రైతులు, మరియు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పాండురంగా రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా పక్షపాతిగా తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ పోరాడుతుందని, భవిష్యత్తులో జిల్లా రాజకీయాల్లో టీఆర్ఎస్ కీలక పాత్ర పోషించబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

# కేరళంలో కాంగ్రెస్ కూటమి విజయంపై కె ఎల్ ఆర్ హర్షం



మహేశ్వరం, మే 04, (ప్రజా కలం)

కేరళంలో యూడిఎఫ్ కూటమి విజయం సాధించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని భారీ ఆధిక్యం సాధించింద న్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యనాయకుల ప్రచారం కలిసి వచ్చిందని కె ఎల్ ఆర్ అన్నారు. అగ్రనేత రాహూల్ గాంధీ ని కేరళం ప్రజలు నమ్మారని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే కేరళంలో పలు సంక్షేమ పథకాలను యూడిఎఫ్ ప్రభుత్వంలో అమలు చేసేందుకు కేంద్ర నాయకత్వం తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఘన విజయానిచ్చిన కాంగ్రెస్ శ్రేణులకు లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు గృహకల్పన ధ్యేయమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం కందుకూరు మండల కేంద్రంలో ల మూర్ గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవు- ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్



మెదక్ మే,04(ప్రజాకలం ప్రతినిధి),మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలంలో రైతులు రహదారుల పై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన ఎల్లపూర్,మిన్ పూర్, యూసుఫ్ పేట, కొత్తపల్లి గ్రామాల శివార్లలో ఉన్న మెదక్ బొడ్మట్ పల్లి రహదారి పై ధాన్యం ఆరబోసిన రైతులతో వారు మాట్లాడారు రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ధాన్యం కుప్పల పక్కన రాళ్లు, కర్రలు పెడుతున్నారని రాత్రివేళ అవి ప్రయాణిస్తున్న వాహనదారులకు కనిపించక ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఖాళీ ప్రదేశాలలో ధాన్యం ఆరబోసుకోవాలన్నారు. ధాన్యం కుప్పల వద్ద ప్రమాదాలు జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు సహకరించాలని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ అంజయ్య, కానిస్టేబుల్ లు ప్రవీణ్,వసంత్,మధు పాల్గొన్నారు.

# రైతులకు భూసార పరీక్ష కార్డుల పంపిణీ

## - ప్రకృతి వ్యవసాయంపై అవగాహన.



సిద్దిపేట ప్రజాకలం మే 04.

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా రాయపోల్ మండల పరిధిలోని రాయపోల్, చిన్నమాసన పల్లి (మంతూర్), ఆరేపల్లి, వడ్డేపల్లి రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి దౌల్తాబాద్--రాయపోల్ ఏఎంసీ ఛైర్మన్ కనకయ్య రైతులకు భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో నెల ఆరోగ్య పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణ, పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ వీడియోలను ప్రదర్శించారు. అలాగే సన్న వరి రకాలపై వివరించి, వాటిని సాగు చేస్తే బోనస్ పొందవచ్చని తెలిపారు. రసాయన ఎరువులతో పాటు పశువుల, కోళ్ల, గొర్ల ఎరువులు లేదా వానపాముల ఎరువులను ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, వేప నూనె, గణజీవ అమృతం, పంచగవ్య, వేస్ట్ డికంపోజర్, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటి కాషాయాలను వినియోగిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఆత్మ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, సాయిల్ వాలంటీర్లు, రైతులు మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.









Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com